విలేకరులు కావలెను
TELANGANA VANI TELUGU DAILY R N I No. APTEL/2012/53127
తెలంగాణ వాణి
తెలంగాణ వ్యాప్తంగా అన్ని జిల్లాలు, నియోజకవర్గాలు, మండలాల వారిగా విలేకర్లు కావలెను.
పొలిటికల్, ప్రజాసమస్యలు, అక్రమాలపై వార్త రాసే పట్టు కలిగిన వారికి మొదటి ప్రాధాన్యత ఇవ్వబడును
9703247143

TELANGANA VANI TELUGU DAILY
R N I No. APTEL/2012/53127
# తెలంగాణ వాణి
తెలుగు దినపత్రిక

తెలంగాణ వాణి TV
THE VOICE OF TELANGANA
ఎడిటర్ జేరిపోతుల సంపత్
9912758107

సంపుటి: 16 | సంచిక : 142 | గురువారం 24. 9. 2026 | ఎడిటర్: జేరిపోతుల సంపత్ | కరీంనగర్ | పేజీలు 8 | వెల: 5.00

## అసైన్డ్ భూములకు యాజమాన్య హక్కులు

**అధికారులకు సీఎం ఆదేశాలు**



హైదరాబాద్ తెలంగాణ వాణి) తెలంగాణ కాంగ్రెస్ మేనిఫెస్టో హామీ మేరకు అసైన్డ్ భూముల లబ్ధిదారులకు పూర్తి యాజమాన్య హక్కులు కల్పించాలని, ఇందుకోసం అవసరమైన కసరత్తు ప్రారంభించాలని అధికారులను సీఎం రేవంత్ రెడ్డి ఆదేశించారు. సెక్రటేరియెట్‌లో జరిగిన ఎస్సీ, ఎస్టీ అత్యాచారాల నిరోధక చట్టం అమలుపై ఉన్నత స్థాయి కమిటీ మిగతా 2లో..

## ప్రజాక్షేత్రంలో మోడీ పాతికేళ్లు

**నాగోల్‌లో బీజేపీ యువ మోర్చా ఆధ్వర్యంలో మెగా రక్తదాన శిబిరం**

**ఎంపి ఈటల రాజేందర్**



హైదరాబాద్ తెలంగాణ వాణి) ప్రధాని నరేంద్ర మోదీ ప్రజాక్షేత్రంలో 25 సంవత్సరాలు పూర్తి చేసుకున్న శుభసందర్భంగా, దేశవ్యాప్తంగా నిర్వహిస్తున్న "సేవా సంకల్ప్ అభియాన్"లో భాగంగా భారతీయ జనతా యువ మోర్చా ఆధ్వర్యంలో నాగోల్ లో నిర్వహించిన మెగా రక్తదాన శిబిరంలో ఎంపి ఈటల రాజేందర్, బిజెపి రాష్ట్ర అధ్యక్షులు ఎన్. రామచందర్ రావు , రాష్ట్ర ప్రధాన కార్యదర్శి (సంస్థాగత) చంద్ర శేఖర్జీ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎంపి ఈటల మాట్లాడుతూ భారత ప్రధాని నరేంద్ర మోదీ 77వ వసంతంలోకి మిగతా 2లో..

## రూ.8500 కోట్ల బకాయిలు

**14 లక్షల మంది విద్యార్థుల స్కాలర్ షిప్‌లివ్వాలి**

**ఫీజులు వెంటనే చెల్లించాలి**

**విద్యానగర్ నుంచి వేలాది మంది విద్యార్థులతో భారీ ప్రదర్శన**

**ప్రభుత్వ వైఖరిపై ఆర్.కృష్ణయ్య ఫైర్**

02



# దళిత విద్యార్థినులపై ఫీజుల భారం..!

- ముందస్తుగా రూ.20 వేల చెల్లింపులు.. మళ్లీ రూ.8 వేల హాస్టల్, మెస్ ఫీజు
- ఫీజు చెల్లించకుంటే హాస్టల్‌లోకి అనుమతి లేదంటున్నారంటూ విద్యార్థినుల ఆవేదన
- స్కాలర్‌షిప్ డబ్బులు తిరిగి ఖాతాల్లో జమ చేయాలని డిమాండ్




**హైదరాబాద్, సెప్టెంబర్ 23 (తెలంగాణ వాణి స్పెషల్ కరస్పాండెంట్ టీ.ఎన్. రమేష్):** ఉన్నత చదువులు చదివి మంచి ఉద్యోగాలు సాధించాలనే లక్ష్యంతో మారుమూల గ్రామాలు, వివిధ జిల్లాల నుంచి హైదరాబాద్‌లోని ఉస్మానియా యూనివర్సిటీకి వచ్చిన పేద విద్యార్థినులకు ఫీజుల భారం ఆందోళన కలిగిస్తోందని పలువురు విద్యార్థినులు, వారి తల్లిదండ్రులు వాపోతున్నారు. ముఖ్యంగా ఎస్సీ వర్గానికి చెందిన విద్యార్థినుల విషయంలో స్కాలర్‌షిప్ పేరుతో ముందుగానే డబ్బులు చెల్లించాల్సి రావడం, అనంతరం హాస్టల్, మెస్ ఫీజు పేరుతో మరోసారి డబ్బులు వసూలు చేస్తున్నారని వారు ఆరోపిస్తున్నారు.

విద్యార్థినుల కథనం ప్రకారం.. డిగ్రీలో మంచి ర్యాంకులు సాధించిన విద్యార్థులకు పీజీలో ఉచిత ప్రవేశం లభిస్తుందని యూనివర్సిటీ నుంచి సమాచారం రావడంతో ఎంతో ఆశతో ఉస్మానియా యూనివర్సిటీకి చేరుకున్నారు. అయితే ఎస్సీ విద్యార్థులకు స్కాలర్‌షిప్ డబ్బులు తర్వాత వస్తాయని, ముందుగా రూ.20 వేల వరకు చెల్లించాల్సి ఉంటుందని అధికారులు తెలిపారని విద్యార్థినులు పేర్కొంటున్నారు.

### అప్పు చేసి రూ.20 వేలు చెల్లింపు

చేతిలో డబ్బులు లేకపోయినా చదువు ఆగిపోతుందనే భయంతో తల్లిదండ్రులు, బంధువులు, శ్రేయోభిలాషుల వద్ద నుంచి అప్పు చేసి పలువురు విద్యార్థినులు రూ.20 వేల వరకు చెల్లించారని చెబుతున్నారు. కొందరు ఫోన్‌పే ద్వారా కూడా చెల్లింపులు చేసినట్లు విద్యార్థినులు పేర్కొంటున్నారు. డబ్బులు సమకూర్చుకోలేని మరికొందరు విద్యార్థినులు పీజీ చదువును కొనసాగించలేక గ్రామాలకు తిరిగి వెళ్లిపోయారని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఉస్మానియా యూనివర్సిటీ అధికారిక సమాచారం ప్రకారం ఎస్సీ, ఎస్టీ, ఎల్‌బీసీ, ఈబీసీ విద్యార్థులకు పీజీ కోర్సుల్లో స్కాలర్‌షిప్‌లు అందుబాటులో ఉన్నాయి. అయితే అర్హతలు, హాజరు, ఇతర నిబంధనలకు లోబడి స్కాలర్‌షిప్‌లు మంజూరవుతాయని యూనివర్సిటీ పేర్కొంది.

### మళ్లీ రూ.8 వేల హాస్టల్, మెస్ ఫీజు?

ఇప్పటికే పది నెలలు కూడా పూర్తికాకముందే మరోసారి రూ.8 వేల హాస్టల్, మెస్ ఫీజు చెల్లించాలని అధికారులు చెబుతున్నారని విద్యార్థినులు ఆరోపిస్తున్నారు. ఆ మొత్తం చెల్లించకపోతే హాస్టల్‌లోకి అనుమతించబోమని సిబ్బంది చెప్పినట్లు వారు వాపోతున్నారు.

ఉస్మానియా యూనివర్సిటీ పరిధిలో మహిళా విద్యార్థుల కోసం ప్రత్యేక హాస్టళ్లు ఉన్నాయని, హాస్టల్ నిర్వహణలో వసతి, భోజనం తదితర అంశాలు సంబంధిత అధికారులు పర్యవేక్షిస్తారని యూనివర్సిటీ అధికారిక వెబ్‌సైట్ పేర్కొంటోంది.

### 500 మంది విద్యార్థినుల్లో 50 మందిలోపే?

లేడీస్ హాస్టల్ కాంప్లెక్స్‌లో సుమారు 500 మంది విద్యార్థినులు ఉండగా, ప్రస్తుతం రూ.8 వేల ఫీజు చెల్లించలేక 50 మందిలోపే హాస్టల్‌లో ఉన్నారని విద్యార్థి వర్గాలు చెబుతున్నాయి. మిగిలిన వారు తమ స్వగ్రామాల్లోనే ఉండాల్సిన పరిస్థితి ఏర్పడిందని తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ సంఖ్యలపై యూనివర్సిటీ అధికారుల అధికారిక వివరణ వెలువడాల్సి ఉంది.

### వివక్ష ఆరోపణలపై స్పష్టత ఇవ్వాలి

ఎస్సీ విద్యార్థులకు సంబంధించిన స్కాలర్‌షిప్ మొత్తాలను ముందుగానే విద్యార్థుల నుంచి తీసుకుంటే, ఆ మొత్తాలు ఎప్పుడు తిరిగి విద్యార్థుల ఖాతాల్లో జమ చేస్తారో ప్రభుత్వం, యూనివర్సిటీ అధికారులు స్పష్టత ఇవ్వాలని దళిత విద్యార్థి సంఘాల ప్రతినిధులు డిమాండ్ చేస్తున్నారు.

ఎస్సీ, ఎస్టీ విద్యార్థుల స్కాలర్‌షిప్‌లు, హాస్టల్, విద్యా సదుపాయాలు అందేలా చూడటం ఉస్మానియా యూనివర్సిటీలోని ఎస్సీ/ఎస్టీ సెల్ బాధ్యతల్లో భాగమని యూనివర్సిటీ అధికారిక సమాచారం చెబుతోంది. విద్యార్థుల సమస్యలను పరిష్కరించేందుకు స్టూడెంట్స్ వెల్ఫేర్ విభాగం కూడా పనిచేస్తుందని యూనివర్సిటీ పేర్కొంది.

### ప్రభుత్వం, యూనివర్సిటీ సమాధానం చెప్పాలి

ఫీజుల కారణంగా పేద విద్యార్థులు చదువుకు దూరం కాకుండా ప్రభుత్వం, యూనివర్సిటీ అధికారులు తక్షణ చర్యలు తీసుకోవాలని విద్యార్థులు, తల్లిదండ్రులు కోరుతున్నారు. ముందుగానే చెల్లించినట్లు చెబుతున్న రూ.20 వేల విషయంలో వాస్తవ పరిస్థితి ఏమిటి? ఆ మొత్తాన్ని స్కాలర్‌షిప్ కింద ఎలా సర్దుబాటు చేస్తారు? రూ.8 వేల హాస్టల్, మెస్ ఫీజుకు సంబంధించిన ఉత్తర్వులు ఏమిటి? అనే అంశాలపై అధికారికంగా స్పష్టత ఇవ్వాలని వారు కోరుతున్నారు.

విద్యార్థుల నుంచి ఫీజులు వసూలు చేయడమే కాకుండా, వారికి అందాల్సిన స్కాలర్‌షిప్‌లు, హాస్టల్ సదుపాయాలు సకాలంలో అందేలా చర్యలు తీసుకోవాలని దళిత విద్యార్థి సంఘాల నాయకులు డిమాండ్ చేస్తున్నారు. పేద విద్యార్థుల ఉన్నత విద్యకు ఆటంకం కలగకుండా ప్రభుత్వం తక్షణమే స్పందించాలని వారు కోరుతున్నారు.

## ఇంటి ముంగిటకే 'మీ సేవా' సేవలు

**డిజిటల్ గవర్నెన్స్'లో రోల్ మోడల్‌గా తెలంగాణ**

**తొలి దశలో 'క్యూర్' ప్రాంతాల్లో అమలు**

**'మీ సేవా డోర్ డెలివరీ సర్వీసెస్' ప్రారంభోత్సవంలో మంత్రి శ్రీధర్ బాబు**



హైదరాబాద్ తెలంగాణ వాణి) 'గుడ్ గవర్నెన్స్'కు టెక్నాలజీని జోడించి 'డిజిటల్ గవర్నెన్స్'లో తెలంగాణను దేశంలోని ఇతర రాష్ట్రాలకు ఒక రోల్ మోడల్ గా తీర్చిదిద్దాలన్నదే తమ ప్రభుత్వ సంకల్పమని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు పేర్కొన్నారు. పౌర సేవల్ని నేరుగా ఇంటి ముంగిటకే చేర్చేందుకు ప్రణాళికాబద్ధంగా కృషి చేస్తున్నామన్నారు. బుధవారం బాగ్ లింగంపల్లిలోని ఆర్టీసీ కళ్యాణ మండపంలో 'మీ సేవా డోర్ డెలివరీ సర్వీసెస్'ను ఆయన లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మిగతా 2లో..

## పవర్ ప్లాంట్ల వద్దకు గులాబీ బృందాలు

**నిజానిజాలు తేల్చడానికి బీఆర్ఎస్ బృందాలు**

**బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్**



హైదరాబాద్ తెలంగాణ వాణి) తెలంగాణ థర్మల్ పవర్ స్టేషన్లలో ఏం జరుగుతుందో? నిజా నిజాలు తేల్చడానికి మా బీఆర్ఎస్ పార్టీ తరపున ఆరు బృందాలు పవర్ స్టేషన్లకు వెళ్తాయని ఆ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. యాదాద్రి థర్మల్ పవర్ స్టేషన్ పర్యటనకు వెళ్లనున్న మాజీ విద్యుత్ శాఖ మంత్రి జగదీష్ రెడ్డి, ఇతర నల్గొండ నాయకుల బృందం, కొత్తగూడెం థర్మల్ పవర్ స్టేషన్ పర్యటనకు వెళ్లనున్న రాజ్యసభ ఎంపీ వద్దిరాజు రవిచంద్ర బృందం, భద్రాద్రి థర్మల్ పవర్ స్టేషన్ మిగతా 2లో..

## ఎండిన పంటలకు జీవం

**జూరాలకు ఆయకట్టుకు సాగు నీరు**

**3 టీఎంసీల నీరిచ్చేందుకు కర్నాటక సానుకూలత**

**ఆయకట్టు రైతులకు ఊరట**



హైదరాబాద్ తెలంగాణ వాణి) తెలంగాణలోని జూరాల ప్రాజెక్టుకు నీటిని విడుదల చేసేందుకు కర్ణాటక ప్రభుత్వం సానుకూలంగా స్పందించింది. విడతల వారీగా 3 టీఎంసీల నీటిని ఇచ్చేందుకు అంగీకారం తెలిపింది. ఈ నిర్ణయంతో ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా రైతులకు భారీ ఊరట లభించినట్లయింది. ఈ మేరకు బుధవారం తెలంగాణ మంత్రులు మిగతా 2లో..




**ఫలించిన రైతుల పోరు**

**దిగొచ్చిన సర్కార్**

**జూరాల ఆయకట్టుకు సాగు నీరు**

**ఎమ్మెల్యే కేటీఆర్**

02

## గణనాధుడికి ఘన వీడ్కోలు !

**నిమజ్జన భద్రతకు భారీ పోలీస్ బలగాలు**

**హైదరాబాద్‌లో 20 వేల మంది పోలీసులు**

**ఇతర జిల్లాల్లో 8,400 మంది సిబ్బంది**

**పోలీసు కమీషనర్ వీసీ సజ్జనార్**



హైదరాబాద్ తెలంగాణ వాణి) హైదరాబాద్ నగరంలో వినాయక విగ్రహాల నిమజ్జన వేడుకలను ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు అన్ని విభాగాల ఉద్యోగులు సమన్వయంతో పనిచేస్తున్నట్లు హైదరాబాద్ పోలీసు కమిషనర్ వీసీ సజ్జనార్ వెల్లడించారు. నిమజ్జన ఏర్పాట్లపై ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. గణేశ్ వేడుకలకు సంబంధించి సోషల్ మీడియాలో కొన్ని ఫేక్ వీడియోలు వైరల్ చేస్తున్నారని, పాత లేదా నకిలీ వీడియోలను పోస్టు చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని మిగతా 2లో..

## యాదాద్రి థర్మల్‌కు 'బొగ్గు ఎలా'?

హైదరాబాద్: యాదాద్రి థర్మల్ విద్యుత్ కేంద్రంలో పూర్తి స్థాయిలో విద్యుదుత్పత్తి జరగకపోవడానికి కారణాలపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క అధికారులను ప్రశ్నించారు. ఎంసీఆర్ హెచ్‌ఆర్డీలో బుధవారం విద్యుత్ శాఖపై నిర్వహించిన సమీక్షలో యాదాద్రి థర్మల్ కేంద్రం నిర్మాణం, బొగ్గు లభ్యత, రవాణా వ్యయం, సింగరేణి పరిస్థితులు, రాష్ట్రంపై పడుతున్న అదనపు ఆర్థిక భారం తది తర అంశాలపై చర్చించారు. రాష్ట్రంలో విద్యుత్ అవసరాలు పెరుగుతున్న నేపథ్యంలో యాదాద్రి ప్లాంట్‌ను పూర్తి సామర్థ్యంతో నడిపించేందుకు తక్షణ చర్యలు చేపట్టాలని సీఎం ఆదేశించారు.

**జీ9 బొగ్గు అవసరం**

యాదాద్రి థర్మల్ విద్యుత్ కేంద్రంలో విద్యుదుత్పత్తికి జీ9 నాణ్యత కలిగిన బొగ్గు అవసరమని అధికారులు సమీక్షలో వివరించారు. అయితే సింగరేణి బొగ్గు గనుల్లో ప్రస్తుతం జీ9 బొగ్గును ఉత్పత్తి చేసే బ్లాకులు లేవని తెలిపారు. సమీప భవిష్యత్తులో సింగరేణి నుంచి జీ9 బొగ్గు అందుబాటులోకి వచ్చే అవకాశాలు తక్కువగా ఉన్నాయని పేర్కొన్నారు. ఈ పరిస్థితిపై సీఎం, డిప్యూటీ సీఎం తీవ్రంగా ప్రశ్నించినట్లు తెలిసింది. జీ9 బొగ్గు లభ్యతే సమస్యగా ఉన్నప్పుడు అదే నాణ్యతకు అనుగుణంగా సాంకేతికతను ఉపయోగించి యాదాద్రి థర్మల్ విద్యుత్ కేంద్రాన్ని ఎందుకు నిర్మించాల్సి వచ్చిందని అధికారుల నుంచి వివరాలు కోరారు. ప్లాంట్ నిర్మాణ సమయంలో బొగ్గు లభ్యత, భవిష్యత్తులో అవసరాలు, రవాణా వ్యయం వంటి అంశాలను పరిగణనలోకి తీసుకున్నారా? లేకపోతే ఎందుకు తీసుకోలేదని ప్రశ్నించినట్లు సమాచారం. సాగుకు కేవలం సోలార్ విద్యుత్ మాత్రమే సరఫరా చేయాలని కేంద్ర ప్రభుత్వం డిస్కంలకు సూచించిందని అధికారులు ముఖ్యమంత్రికి తెలియజేశారు.

**పిట్‌హెడ్ విధానంపై ప్రశ్నలు**

సాధారణంగా బొగ్గు గనుల సమీపంలోనే థర్మల్ విద్యుత్ కేంద్రాన్ని ఏర్పాటు చేస్తే బొగ్గు రవాణా వ్యయం తగ్గుతుంది. దీనినే పిట్‌హెడ్ విధానం అంటారు. అయితే యాదాద్రి థర్మల్ కేంద్రాన్ని బొగ్గు గనులకు దూరంగా ఎందుకు ఏర్పాటు చేశారనే అంశంపైనా సీఎం, డిప్యూటీ సీఎం అధికారులను నిలదీశారు. యాదాద్రి ప్లాంట్‌ను పిట్‌హెడ్ ప్రాంతంలో కాకుండా దూరంగా ఏర్పాటు చేయడం వల్ల బొగ్గును రైలు, ఇతర రవాణా మార్గాల ద్వారా తరలించాల్సి వస్తోందని, దీంతో విద్యుత్ ఉత్పత్తి వ్యయం పెరుగుతోందని అధికారులు వివరించినట్లు తెలిసింది. ప్లాంట్ నిర్మాణ సమయంలోనే ఈ అంశాలను పరిగణనలోకి తీసుకున్నారా? దూరంగా నిర్మించడం వల్ల రాష్ట్రానికి దీర్ఘకాలంలో ఎంత అదనపు భారం పడుతుందనే దానిపైనా వివరాలు సమర్పించాలని సీఎం సూచించారు.

**రాజకీయ కారణాలతోనేనా?**

యాదాద్రి థర్మల్ విద్యుత్ కేంద్రాన్ని పిట్‌హెడ్ ప్రాంతంలో ఏర్పాటు చేయకుండా దూరంగా నిర్మించడానికి గతంలో రాజకీయ కారణాలే ప్రధానంగా ఉన్నాయని అధికారులు సమీక్షలో వెల్లడించినట్లు సమాచారం. దీనిపై సీఎం, డిప్యూటీ సీఎం మరిన్ని వివరాలు అడిగినట్లు తెలిసింది. బొగ్గు గనుల నుంచి దూరంగా ప్లాంట్ ఏర్పాటు చేయడం వల్ల ప్రస్తుతం బొగ్గు రవాణా, సరఫరా వ్యయం రాష్ట్ర ఖజానాపై భారంగా మారిందని అధికారులు వివరించారు. యాదాద్రి థర్మల్ విద్యుత్ కేంద్రానికి బొగ్గును తరలించి సరఫరా చేయడం వల్ల తెలంగాణపై రూ.40 వేల కోట్ల అదనపు భారం పడుతోందని అధికారులు సమీక్షలో తెలిపారు.



## ఎండిన పంటలకు జీవం



(మొదటి పేజీ తరువాయి)
జూపల్లి కృష్ణారావు, వాకిటి శ్రీహరి నేతృత్వంలోని ప్రజాప్రతినిధుల బృందం బెంగళూరులో కర్ణాటక ముఖ్యమంత్రి డీకే శివకుమార్‌తో సమావేశమైంది. జూరాల ప్రాజెక్టు కింద నీటి అవసరాలను, వర్షాభావ పరిస్థితుల వల్ల రైతులు ఎదుర్కొంటున్న తీవ్ర ఇబ్బందులను వారు ఆయనకు వివరించారు.తెలంగాణ మంత్రుల విజ్ఞప్తిని పరిశీలించిన డీకే శివకుమార్, అధికారులతో చర్చించిన అనంతరం జూరాలకు నీటిని విడుదల చేసేందుకు అంగీకరించారు. దీంతో జూరాల ఆయకట్టు కింద ఎండిపోతున్న పంటలకు జీవం పోసినట్లయింది. రాష్ట్ర ప్రభుత్వ విజ్ఞప్తికి కర్ణాటక సానుకూలంగా స్పందించడం పట్ల రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.ఉమ్మడి పాలమూరు జిల్లాలో రైతులు ఎదుర్కొంటున్న పరిస్థితి, వారి కష్టాలను డీకేకు వివరించారు. జూరాల ప్రాజెక్టుతో పాటు భీమా, నెట్టెంపాడు, కోయిల్‌సాగర్ ఆయకట్టు పంటలను కాపాడాలని కర్ణాటక సీఎంకు విజ్ఞప్తి చేశారు. తెలంగాణలోని ఉమ్మడి పాలమూరు ప్రాజెక్టుల కింద 5.5 లక్షల ఎకరాల ఆయకట్టు సాగవుతోందని, ఎల్ నినో ప్రభావంతో వర్షాభావ పరిస్థితులు నెలకొన్నాయని వివరించారు. ప్రస్తుతం ఆయకట్టు పరిధిలోని పంటలు కీలక దశలో ఉన్నాయని.. నీళ్లు లేకపోతే పంటలు ఎండిపోయి దిగుబడులపై ప్రతికూలా ప్రభావం పడుతుందని శివకుమార్‌కు తెలంగాణ ప్రతినిధుల బృందం వివరించింది.ఉమ్మడి పాలమూరు రైతులు నీళ్లపై ఎన్నో ఆశలు పెట్టుకున్నారని, పంటలు ఎండిపోతే వారి ఆదాయం, జీవనోపాధిపై ప్రభావం పడుతుందన్నారు. తెలంగాణ మంత్రులు, ప్రజాప్రతినిధుల విజ్ఞప్తిపై సానుకూలంగా స్పందించి సీఎం శివకుమార్ అందుకు తగిన ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు. దాదాపు 5 వేల క్యూసెక్కుల వరకు కృష్ణా జలాలు విడుదల చేయాలని తెలంగాణ నేతలు కోరినట్లు తెలుస్తోంది. ఉమ్మడి పాలమూరు మంత్రులు, ఎమ్మెల్యేల విజ్ఞప్తికి సానుకూలంగా స్పందించిన సీఎం డీకే శివకుమార్.. రైతులను ఆదుకునేందుకు నీటి విడుదలకు నిర్ణయం తీసుకుని అధికారులను ఆదేశించారు. రైతుల ఆదుకునేందుకు కృష్ణా జలాల విడుదలకు కర్ణాటక ప్రభుత్వం అంగీకరించడంతో పాలమూరు ప్రాంత రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. జూరాల ప్రాజెక్టు నుంచి నీళ్లు విడుల చేయకపోవడంతో పంటలు ఎండిపోతున్నాయని ఉమ్మడి పాలమూరు రైతులు ఆవేదన వ్యక్తం చేస్తే గతవారం వారే స్వయంగా వెళ్లి రెగ్యులేటర్ ద్వారా నీటిని విడుదల చేసుకున్నారు. అధికారులు పోలీసుల సహాయంతో గేట్లు క్లోజ్ చేసి నీటి విడుదలను తాత్కాలికంగా నిలిపివేశారు. అయితే రైతులతో కలిసి బీఆర్ఎస్ నేతలు జూరాల ప్రాజెక్టు నీటి విడుదల కోసం వారం రోజుల నుంచి ఆందోళన చేపడుతున్నారు. ఈ క్రమంలో తెలంగాణ ప్రభుత్వం కర్ణాటక ప్రభుత్వంతో చర్చలు జరిపి, నీటి విడుదలకు డీకే శివకుమార్ ను ఒప్పించడంలో సక్సెస్ అయింది.

## పవర్ ప్లాంట్ల వద్దకు గులాబీ బృందాలు



(మొదటి పేజీ తరువాయి)
పర్యటనకు వెళ్లనున్న మాజీ మంత్రి పువ్వాడ అజయ్ బృందం, కాకతీయ థర్మల్ పవర్ స్టేషన్ పర్యటనకు వెళ్లనున్న మాజీ మంత్రులు ఎర్రబెల్లి దయాకర్ రావు, సత్యవతి రాథోడ్, ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి బృందం, సింగరేణి థర్మల్ పవర్ స్టేషన్ పర్యటనకు వెళ్లనున్న మాజీ మంత్రి జోగు రామన్న, ఎమ్మెల్యేలు అనిల్ జాదవ్, కోవా లక్ష్మీ, మాజీ ఎమ్మెల్యేలు బాల్క సుమన్, కోనేరు కోనప్ప, దుర్గం చిన్నయ్య, దివాకర్ రావు, సింగరేణి ప్రధాన కార్యాలయం పర్యటనకు వెళ్లనున్న మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్, ఎమ్మెల్యే కేపీ వివేకానంద, ఎమ్మెల్సీలు దాసోజు శ్రవణ్, శంభీపూర్ రాజు లు వెళతారని అయన అన్నారు.కేటీఆర్ మాట్లాడుతూ సోషల్ డియాలో 1980'బ ట్రెండ్ నడుస్తుంది.. తెలంగాణలో 1980'బ రోజుల్లో కరెంట్ కోతలతో రైతులు అవస్థలు పడినట్లు ఇప్పుడు అవస్థలు పడుతున్నారు. కాంగ్రెస్ ఉంటే కరెంట్ ఉండదని మేము ముందే చెప్పాం.. ఇవాళ అదే జరుగుతుంది. తెలంగాణలో ప్రతి చోట కరెంట్ కోతలు ఉన్నాయని రోజూ పత్రికల్లో వస్తున్నాయి. వీటి ద సబ్‌స్టేషన్ల దగ్గరికి వెళ్లి చెక్ చేస్తే 6 గంటలకు మించి కరెంట్ ఇవ్వడం లేదు. గతంలో ఉమ్మడి రాష్ట్రంలో ముఖ్యమంత్రి కిరణ్ కుమార్ రెడ్డి తెలంగాణ వస్తే కరెంట్ ఉండదని అన్నాడు. కానీ తెలంగాణ తెచ్చి 24 గంటలు కరెంట్ ఇచ్చి చూపించాం.. మళ్లీ ఇప్పుడు కిరణ్ కుమార్ రెడ్డి చెప్పినట్లు రేవంత్ రెడ్డి కరెంట్ లేకుండా చేస్తున్నాడని విమర్శించారు.

## ఫలించిన రైతుల పోరు దిగొచ్చిన సర్కార్

**జూరాల ఆయకట్టుకు సాగు నీరు**

**ఎమ్మెల్యే కేటీఆర్**

జూరాల ప్రాజెక్టు కుడి, ఎడమ కాలువలకు అధికారులు నీటిని విడుదల చేసిన పరిణామంపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్ స్పందించారు. "పోరాడితే పోయేదేమీ లేదు.. బానిస సంకెళ్లు తప్ప" అనే ప్రసిద్ధ నినాదాన్ని గుర్తుచేస్తూ... తమ హక్కుల సాధన కోసం రోడ్డెక్కిన పాలమూరు అన్నదాతల పోరాట పటిమ గొప్పదని కొనియాడుతూ సోషల్ మీడియా వేదికగా ట్వీట్ చేశారు. కాలువలకు నీరు అందక పంట పొలాలు ఎండిపోతున్న విపత్కర పరిస్థితుల్లో రైతులు చేసిన సమరశీల పోరాటం అత్యంత స్ఫూర్తిదాయకమని అభివర్ణించారు. రైతాంగ సమస్యలను పట్టించుకోకుండా నిర్లక్ష్యంగా వ్యవహరించిన ఈ ప్రభుత్వాన్ని రైతులు ముల్లుగర్రతో తట్టి నిద్రలేపి, నీటిని విడుదల చేసేలా పరుగులు పెట్టించారని కేటీఆర్ ప్రశంసించారు. క్షేత్రస్థాయిలో ప్రభుత్వ నిర్బంధాలను సైతం ఎదుర్కొని రైతులకు అండగా నిలిచిన బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ప్రజా సమస్యలపై నిరంతరం ప్రశ్నించడం, తెలంగాణ ప్రజల కనీస అవసరాలను తీర్చేలా ఈ ప్రభుత్వాన్ని పరుగులు పెట్టించడమే రాబోయే కాలంలో బీఆర్ఎస్ ప్రధాన కర్తవ్యమని స్పష్టం చేశారు. రైతుల ఉద్యమ ఒత్తిడి వల్లే ప్రభుత్వం ఎట్టకేలకు దిగొచ్చి నీటిని విడుదల చేయాల్సి వచ్చిందని పేర్కొన్నారు.

## గణనాథుడికి ఘన వీడ్కోలు !

(మొదటి పేజీ తరువాయి)
హెచ్చరించారు. అదేవిధంగా గణేశ్ మండపాల వద్ద అసభ్యకరమైన వల్గర్ పాటలు మరియు డ్యాన్స్‌లపై ఫిర్యాదులు అందాయని తెలిపారు.నిమజ్జన వేడుకల భద్రత కోసం హైదరాబాద్‌లో 20 వేల మంది పోలీసులు, ఇతర జిల్లాల్లో 8,400 మంది సిబ్బంది బందోబస్తులో పాల్గొంటారని సీపీ తెలిపారు. ఖైరతాబాద్ మరియు బాలాపూర్ గణేశ్ శోభాయాత్రకు ప్రత్యేక బందోబస్తు ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. వినాయక చవితి వేడుకల పర్యవేక్షణ కోసం ఈసారి ఏఐ టెక్నాలజీని వినియోగిస్తున్నట్లు తెలిపారు. శోభాయాత్ర పరిశీలనకు 24 డ్రోన్లను



వాడుతుండగా, కమాండ్ కంట్రోల్ సెంటర్‌కు 10 వేల సీసీ కెమెరాలను అనుసంధానించారు. హుస్సేన్ సాగర్ చుట్టూ 100 హైరైజ్ కెమెరాలను ఏర్పాటు చేశారు.నిమజ్జన విధుల్లో 25 క్రైమ్ విభాగాల టీమ్‌లు పనిచేస్తాయని, చైన్ స్నాచింగ్‌లు, ఇతర చోరీలను అరికట్టేందుకు ప్రత్యేక నిఘా ఉంటుందని చెప్పారు. అలాగే మహిళల రక్షణ కోసం షీటీమ్‌లు కూడా అందుబాటులో ఉంటాయని స్పష్టం చేశారు. నిమజ్జన వేడుకల్లో డీజేల వినియోగంపై కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. ఖైరతాబాద్ గణేశ్ దర్శనానికి ఇవాళ అర్ధరాత్రి 12 గంటల వరకే అనుమతి ఉంటుందని తెలిపారు. ఎల్లుండి ట్యాంక్‌బండ్, నెక్లెస్ రోడ్ పరిసరాల్లో ప్రత్యేక ట్రాఫిక్ ఆంక్షలు అమల్లో ఉంటాయి. ఈనెల 25న ప్రైవేటు బస్సులు, ఇతర ప్రైవేటు ట్రక్కులకు నగరంలోకి ప్రవేశం ఉండదని సీపీ సజ్జనార్ వెల్లడించారు.

# కొత్త శిఖరాలకు ఆర్థిక ప్రగతి

(మొదటి పేజీ తరువాయి)
సందర్భంగా ఏర్పాట్లు, ప్రచారం, రోడ్‌షోల నిర్వహణపై డిప్యూటీ సీఎం పక్కా కార్యాచరణను ఖరారు చేశారు.



ఈ సందర్భంగా డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మాట్లాడుతూ ప్రజా ప్రభుత్వం ఏర్పడిన తర్వాత నిర్వహిస్తున్న రెండో ప్రపంచ సదస్సు ఇదని, దీని ద్వారా రాష్ట్ర సమగ్ర అభివృద్ధికి బలమైన పునాదులు వేయాలని పిలుపు నిచ్చారు. 2047 నాటికి తెలంగాణను 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నామని తెలిపారు. సదస్సు నిర్వహణ పర్యవేక్షణకు దాదాపు 10 ప్రత్యేక అధికారుల కమిటీలను ఏర్పాటు చేశామని, ప్రతి కమిటీకి ఒక సీనియర్ అధికారి నేతృత్వం వహిస్తారని వెల్లడించారు. పనుల రూపకల్పన, బడ్జెట్ అంచనాలు, ఆమోదాల ప్రక్రియలో ఎలాంటి ఆలస్యం జరగడానికి వీల్లేదని స్పష్టం చేశారు.హౌ అధికారుల కమిటీలతో పాటు ఎగ్జిక్యూటివ్ కౌన్సిళ్లను ఏర్పాటు చేసి, వాటికి సంబంధిత మంత్రులను చైర్‌పర్సన్లుగా నియమించినట్లు తెలిపారు. ప్రతి కమిటీకి కన్వీనర్లను కూడా నియమించామని, వారు వెంటనే సంబంధిత మంత్రులను కలిసి బాధ్యతలు స్వీకరించి పనులు ప్రారంభించాలని సూచించారు. అన్ని విభాగాలను సమన్వయం చేసుకుంటూ ప్రతిరోజూ కార్యక్రమాలు జరిగేలా చూడాలని అన్నారు.

ఈ గ్లోబల్ సమ్మిట్‌ను ప్రపంచవ్యాప్తంగా ప్రచారం చేసేందుకు ప్రింట్, ఎలక్ట్రానిక్, డిజిటల్, సోషల్ మీడియా వేదికలను పూర్తిస్థాయిలో వినియోగించుకోవాలని సూచించారు. "ఈ రోజు నుంచే ప్రతిరోజూ సదస్సుకు సంబంధించిన ఏదో ఒక వార్త మారుమోగాలి. ప్రచారానికి ఆకాశమే హద్దుగా పనిచేసి, పెద్ద సంఖ్యలో అంతర్జాతీయ మీడియా ప్రతినిధులు హాజరయ్యేలా చూడాలి" అని అధికారులకు స్పష్టం చేశారు. 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థే ధ్యేయం

2047 నాటికి తెలంగాణను 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దాలన్న బృహత్తర లక్ష్యంలో ఈ సమ్మిట్ కీలక మైలురాయి కానుందని పేర్కొన్నారు. గతంలో కుదిరిన ఎంవోయూలను కూడా సమీక్షించి, వాటి అమలు పురోగతిని పరిశీలించాలని అధికారులను ఆదేశించారు. రాష్ట్ర భవిష్యత్తు, అభివృద్ధి, ఆర్థిక ప్రగతికి ప్రతి అధికారి భాగస్వామి కావాలని సూచించారు. సదస్సు ఏర్పాట్లను కేవలం ఒక కార్యక్రమంగా కాకుండా రాష్ట్రానికి దీర్ఘకాలికంగా ఉపయోగపడే ఆస్తిగా తీర్చిదిద్దాలని అన్నారు. తెలంగాణకు పెట్టుబడులు వచ్చే అవకాశాలు ఎక్కువగా ఉన్న దేశాలు, నగరాలు, రంగాలను గుర్తించి దేశీయ, అంతర్జాతీయ రోడ్‌షోలు నిర్వహించేందుకు స్పష్టమైన యాక్షన్ ప్లాన్ సిద్ధం చేయాలనిహౌసూచించారు. ఏ దేశంలో ఏ రంగంలో పెట్టుబడులకు అవకాశాలు ఉన్నాయో అధ్యయనం చేసి, దానికి అనుగుణంగా రోడ్‌షోల ప్రణాళిక రూపొందించి మంత్రిమండలి ఉపసంఘానికి నివేదించాలని అధికారులను ఆదేశించారు. అనంతరం కార్యాచరణ ప్రణాళికను ఖరారు చేసి రోడ్‌షోలను ప్రారంభించాలన్నారు.

అధికారులు వెంటనే తమ టీమ్‌లతో సమావేశమై వార్ రూమ్ ద్వారా పనులను పర్యవేక్షించాలని, ప్రతిరోజూ సాయంత్రం పనుల పురోగతిని తనిఖీ చేసిన తర్వాతే రోజువారీ బాధ్యతలు ముగించాలని చెప్పారు.హౌప్రతినిధుల స్పందనను బట్టి అవసరమైతే ప్రస్తుతం అనుకుంటున్న 4 సభా ప్రాంగణాలను (హాల్స్) 6 లేదా 8కి పెంచేందుకు సిద్ధంగా ఉండాలని సూచించారు. రాష్ట్ర భవిష్యత్తు, ఆర్థిక వికాసంలో అధికారులందరూ భాగస్వాములు కావాలని, ఎక్కడా రాజీ పడకుండా ఈ గ్లోబల్ సమ్మిట్‌ను చారిత్రాత్మక విజయం చేయాలని డిప్యూటీ సీఎం ఆకాంక్షించారు.

## ప్రజాక్షేత్రంలో మోడీ పాతికేళ్లు

(మొదటి పేజీ తరువాయి)
అడుగుపెట్టారు. 25 ఏళ్లు గుజరాత్ ముఖ్యమంత్రిగా, దేశ ప్రధానిగా వారు అందించిన సేవలు దేశం గర్వపడుతుంది. రతజాతి కులాలు మతాలు ప్రాంతాలకు అతీతంగా ఆయన్ని గుర్తించి గౌరవిస్తుంది. ప్రపంచ చిత్రపటం ద దేశ ఔన్నత్యాన్ని మోదీ రు పెంచారు అనడంలో సందేహం లేదని అన్నారు. భారతదేశం సొంత కాళ్ళ మీద నిలబడి మోడ్రన్ రైల్వే సిస్టం, ఎయిర్పోర్టు, వేల కిలోటర్ల జాతీయ రహదారులు ఏర్పాటు చేస్తున్నారు. మౌలిక సదుపాయాల కోసం 2014 కంటే ముందు 2 లక్షల కోట్ల రూపాయల ఖర్చు చేస్తే ఇప్పుడు 15 లక్షల కోట్ల రూపాయలు ఖర్చు పెడుతున్నాం. దేశాన్ని గొప్పగా తీర్చిదిద్దుతున్నారు. ఆయన ఎప్పుడూ నేను పాలకున్ని అని అనరు, సేవకున్ని మాత్రమే అని చెప్తారు.

76 సంవత్సరాల వయసులో కూడా ఒక్కరోజు కూడా సెలవు లేకుండా నిరంతరం యంత్రంలాగా పనిచేస్తూ దేశాన్ని ముందుకు తీసుకుపోతున్న మోదీ మరింత ఆరోగ్యవంతంగా ఉండి, ప్రజల ఆశీర్వాదం పొంది, భగవంతుని దయతో మరింత సేవా అందించాలని కోరుతున్నామని అన్నారు. ఈరోజు బీజేవైయం ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం నిర్వహించాము. ఇందులో పాల్గొని రక్త దానం చేసిన ప్రతి ఒక్కరికీ హృదయపూర్వక కృతజ్ఞతలని అన్నారు.

ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షులు కాసం వెంకటేశ్వర్లు, బండ కార్తీక, రాష్ట్ర ప్రధాన కార్యదర్శులు ఎస్. గౌతం రావు, తుళ్ల వీరేందర్ గౌడ్ , బీజేవైయం రాష్ట్ర అధ్యక్షులు కుండె గణేష్ రంగారెడ్డి అర్బన్ జిల్లా అధ్యక్షులు వనిపల్లి శ్రీనివాస్ రెడ్డి మాజీ అధ్యక్షులు సామ రంగారెడ్డి, పార్టీ శ్రేణులు పాల్గొన్నారు.

## అంబానీని వెనక్కి నెట్టిన అదానీ..

(మొదటి పేజీ తరువాయి)
రూ. 9.23 లక్షల కోట్లకు చేరింది. అదే సమయంలో, ముఖేశ్ అంబానీ సంపద 10 శాతం తగ్గి రూ. 8.63 లక్షల కోట్లకు పరిమితమైంది. దీంతో అదానీ సుమారు రూ. 59,400 కోట్ల ఆధిక్యంతో అంబానీని వెనక్కి నెట్టారు. ఈ జాబితాలో ఆర్సెలర్‌మిట్టల్ యజమాని ఎల్.ఎన్. మిట్టల్ కుటుంబం 93 శాతం వృద్ధితో, రూ. 3.39 లక్షల కోట్ల సంపదతో మూడో స్థానంలో నిలిచింది.

ఈ ఏడాది జాబితాలో మహిళా సంపన్నుల సంఖ్య గణనీయంగా పెరగడం గమనార్హం. కొత్తగా 131 మంది మహిళలు ఈ జాబితాలో చోటు దక్కించుకున్నారు. మహిళల విభాగంలో రూ. 2.79 లక్షల కోట్ల సంపదతో రోష్నీ నాడార్ మల్హోత్రా అగ్రస్థానంలో నిలిచారు. దేశంలో డాలర్ బిలియనీర్ల సంఖ్య కూడా రికార్డు స్థాయిలో 391కి చేరింది. అత్యధిక సంపన్నులు ఉన్న నగరంగా ముంబై ప్రథమ స్థానంలో నిలవగా, బెంగళూరు, ఢిల్లీ తర్వాతి స్థానాల్లో ఉన్నాయి.

సాంకేతిక రంగం నుంచి కొత్త సంపన్నుల సంఖ్య క్రమంగా పెరుగుతోంది. ముఖ్యంగా ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) రంగానికి చెందిన 19 మంది ఈ జాబితాలో స్థానం సంపాదించగా, వారిలో 15 మంది కొత్తవారు కావడం విశేషం. క్వాంటం కంప్యూటింగ్ విభాగం నుంచి తొలిసారిగా బెంగళూరుకు చెందిన నాగేంద్ర నాగరాజ (ఉజూఅూఅ) రూ. 1,700 కోట్ల సంపదతో ఈ జాబితాలో చేరారు.

## రోజులు నిండలే నిండు నూరేళ్ళు!

(మొదటి పేజీ తరువాయి)
మండిపడ్డారు. బాధిత కుటుంబాలకు ప్రభుత్వం రూ.50 లక్షల ఎక్స్ గ్రేషియా ప్రకటించాలని కవిత డిమాండ్ చేశారు. నెల రోజుల్లో హాస్పిటల్ పెండింగ్ బిల్లు చెల్లించాలని, ఆదివాసీ ప్రాంతాలకు రోడ్లు వేయాలన్నారు. లేదంటే ఏజెన్సీల్లోని ఆదివాసీలతో కలిసి ఆదిలాబాద్‌ను ఘెరావ్ చేస్తామన్నారు. "ఆదిలాబాద్ రిమ్స్‌లో హృదయవిదాకరమైన సంఘటన జరిగింది. రోజులు కూడా నిండకముందే ఐదుగురు పసివాళ్లకు నిండు నూరేళ్లు నిండాయి. ఇది ప్రమాదవశాత్తు జరిగిన సంఘటననో, ప్రకృతి ప్రకోపం కారణంగానో జరగలేదు. కేవలం ఈ కాంగ్రెస్ సర్కార్ నిర్లక్ష్యం కారణంగా జరిగిన సంఘటనే. ఇదే మొదటి సంఘటన కాదు. ఈ హాస్పిటల్‌లో గతేడాది 204 మంది, అంతకుముందు ఏడాది 174 మంది చిన్నారులు చనిపోయారు. ఇలాంటి పరిస్థితి ఉన్నప్పుడు ఇక్కడ పరిస్థితులపై ప్రభుత్వం బేరీజు వేసుకొని చర్యలు తీసుకోవాలి. ముఖ్యంగా ఏజెన్సీ ప్రాంతాల నుంచి హాస్పిటల్‌కు వచ్చేందుకు సరైన రోడ్లు లేవు. ఏ రోజు పేపర్ చూసిన గర్భిణీ మృతి, చిన్నారులు మృతి అనే వార్తలే ఉంటున్నాయి. ఈ పరిస్థితి గురించి వార్తలు రాసి, కథనాలు ప్రచురించి మీడియా వాళ్లే విసిగిపోయారు"- కవిత 150 మంది డాక్టర్లు ఉండాల్సిన ఆసుపత్రిలో సగం మంది కూడా లేరని కవిత ఆరోపించారు. నర్సులు సగం మందే ఉన్నారని, శానిటేషన్ సిబ్బంది 20 శాతం మాత్రమే ఉన్నారన్నారు. సిబ్బందితో నడ్డి విరిగేలా పనిచేయిస్తూ వాళ్లను ఇబ్బంది పెడుతున్నారని మండిపడ్డారు. 150 ఏసీలు ఉంటే ఒక్క మెకానిక్ లేడని, ముగ్గురు ఎలక్ట్రీషియన్స్ మాత్రమే ఉన్నారన్నారు. ఆరోగ్యశ్రీ పథకం కింద 500 కోట్ల రూపాయల బకాయిలు రావాల్సి ఉందన్నారు. ఈ సంఘటనకు హాస్పిటల్ సిబ్బంది గానీ పేషెంట్లది గానీ తప్పు కాదన్నారు. ఆదిలాబాద్ జిల్లాను దత్తత తీసుకున్నానని ముఖ్యమంత్రి చెప్పారని,



దత్తత తీసుకున్న జిల్లా పరిస్థితి ఇలా ఉంటుందా? ఐదు మంది పిల్లలు చనిపోతే వచ్చి చూసేందుకు తీరక లేదా? అని ప్రశ్నించారు.

'మైనార్టీ, ఆదివాసీ పిల్లలు చనిపోతే చూసే ఓపిక కూడా ఈ ముఖ్యమంత్రికి లేదా? హెల్త్ మినిస్టర్ వచ్చి ఇక్కడ కనీసం గంటన్నర కూడా లేరు. ఆయన వచ్చి కలెక్టర్‌తో సమీక్ష నిర్వహించలేదు. ఎక్స్‌కర్షన్‌కు వచ్చినట్లు వచ్చి వెళ్లారు. పేదలైన బాధిత కుటుంబాలకు కనీసం పైసా సాయం చేయలేదు. ప్రభుత్వం చేసిన తప్పులకు పరిహారం కాదు ఫైన్ కట్టాలి. ప్రతి కుటుంబానికి రూ. 50 లక్షలు ఇవ్వాలి. ప్రభుత్వం చేసిన తప్పునకు కచ్చితంగా మూల్యం చెల్లించుకోవాల్సిందే. జనం బాటలో భాగంగా ఈ ప్రాంతానికి వచ్చినప్పుడే ఇక్కడి పరిస్థితులను ప్రభుత్వానికి చెప్పాం. అడవులతో పచ్చగా ఉండే ఆదిలాబాద్‌లో క్యానర్స్ పేషెంట్లు పెరుగుతున్నారని చెప్పినా ప్రభుత్వం పట్టించుకోలేదు. ఆదిలాబాద్ జిల్లాలో హెల్త్ ప్రొఫైల్‌కు సంబంధించి కమిటీ వేస్తాం. ఆ కమిటీ ద్వారా అన్ని అంశాలపై స్టడీ చేసి నివేదిక ఇస్తాం. ఒక్క రిమ్స్‌లోనే కాదు రాష్ట్ర వ్యాప్తంగా అన్ని హాస్పిటల్స్‌లో పరిస్థితులు బాగా లేవు. వరంగల్ ఎంజీఎంలో పై కప్పు కూలింది. నాగర్ కర్నూల్‌లో ఎలుకలు కొరికి ఈసీజీ మెషీన్ పనిచేయటం లేదు. కచ్చితంగా అన్ని ప్రభుత్వ హాస్పిటల్స్‌లో ఫోరెన్సిక్ అడిట్ నిర్వహించాలి' అని కవిత అన్నారు. రాష్ట్ర బడ్జెట్లో హెల్త్ కోసం 10 శాతం బడ్జెట్ కేటాయిస్తామన్న సీఎం 5 శాతం మాత్రమే కేటాయిస్తున్నారని కవిత ఆరోపించారు. దాంట్లో సగం జీతాలకే పోతుందని, ఇక మౌలిక సదుపాయాలకు ఆ నిధులు ఏం సరిపోతాయ్? అని ప్రశ్నించారు. ముఖ్యమంత్రికి నెల రోజులు సమయం ఇస్తున్నామని, ఈ లోగా పెండింగ్ బిల్లులు చెల్లించి...ఈ ప్రాంతంలో రోడ్లు వేయించాలన్నారు. అదే విధంగా ఈ జిల్లాకు ముఖ్యమంత్రి వచ్చి పరిస్థితిని తెలుసుకోవాలని, ఎస్టీల కోసం వస్తున్న ఫండ్స్‌కు లెక్క చెప్పాలన్నారు. ఆషామాషీగా వచ్చి చూసి పోయే పార్టీ కాదు మాది. ప్రశ్నిస్తాం, పోరాడుతాం, పరిష్కారం అయ్యే వరకు ఫైట్ చేస్తామన్నారు.

## అసైన్డ్ భూములకు యాజమాన్య హక్కులు

(మొదటి పేజీ తరువాయి)
సమావేశంలో ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిసింది. అసైన్డ్ భూముల పరిరక్షణకు ఎంజాయ్‌మెంట్ సర్వే నిర్వహించాలని, జిల్లాల్లో అసైన్డ్ కమిటీలు ఏర్పాటు చేయాలని సూచించినట్లు సమాచారం.

## 'ఇంటి ముంగిటకే 'మీ సేవా' సేవలు



(మొదటి పేజీ తరువాయి)
శ్రీధర్ బాబు మాట్లాడుతూ... మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా పాలనలోనూ అనేక విప్లవాత్మక సంస్కరణలకు శ్రీకారం చుడుతున్నామన్నారు. అడ్మినిస్ట్రేషన్ కు టెక్నాలజీని జోడించి పారదర్శకత, జవాబుదారీతనం, సుపరిపాలనకు పెద్దపీట వేస్తున్నామన్నారు. ప్రభుత్వం, యంత్రాంగమే నేరుగా ప్రజల దగ్గరికే వెళ్లేలా ఈ 'డోర్ డెలివరీ సర్వీసెస్'కు శ్రీకారం చుట్టామన్నారు. 1100 టోల్ ఫ్రీ నంబర్ లేదా మీ సేవ పోర్టల్ ద్వారా స్లాట్ బుక్ చేసుకుంటే... జనన/మరణ ధృవీకరణ పత్రాలు, ఆదాయ, కుల, నివాస సర్టిఫికేట్లు, ఈసీ కాపీలు, పోలీసు శాఖ సేవలు, ఐజీఆర్ఎస్ రిజిస్ట్రేషన్లు తదితర మీ సేవా సేవలను ఇంటి దగ్గరే అందిస్తామన్నారు. ఇందుకోసం 70 మందికి పైగా మీ సేవ ఏజెంట్లు, మీ సేవ వీఎల్ఈలకు ప్రత్యేక శిక్షణ ఇచ్చామన్నారు. తొలిదశలో 'క్యూర్' ప్రాంతాల్లో ఈ సేవలను ప్రారంభిస్తున్నామన్నారు. రాబోయే రోజుల్లో రాష్ట్రంలోని ఇతర ప్రాంతాలకూ విస్తరిస్తామన్నారు. పౌరులు ఈ సౌకర్యాన్ని సద్వినియోగం చేసుకుని... ఇంటి నుంచే పౌర సేవల్ని పొందాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో ఐటీఈఅండ్ సీ సంయుక్త కార్యదర్శి అనుదీప్ దురిశెట్టి, మీ సేవా కమిషనర్ రవి కిరణ్, టీజీటీఎస్ ఎండీ సత్యనారాయణ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## రూ.8500 కోట్ల బకాయిలు

**14 లక్షల మంది విద్యార్థుల స్కాలర్ షిప్‌లివ్వాలి**

**ఫీజులు వెంటనే చెల్లించాలి**

**విద్యానగర్ నుంచి వేలాది మంది విద్యార్థులతో భారీ ప్రదర్శన**

**ప్రభుత్వ వైఖరిపై ఆర్.కృష్ణయ్య ఫైర్**



రాష్ట్రంలో 14 లక్షల మంది కాలేజీ విద్యార్థుల స్కాలర్ షిప్లు, ఫీజుల బకాయిలు 8500 కోట్లు వెంటనే విడుదల చేయాలని, ఈ స్కీము ఎత్తివేయాలనే కుట్రలు మానుకోవాలని, ఈ స్కీమును యధాతథంగా పాత పద్ధతిలోనే అమలు చేయాలని డిమాండ్ చేస్తూ వేలాది మంది విద్యార్థులు నేడు విద్యానగర్ నుంచి భారీ ప్రదర్శన జరిపారు. ఈ ప్రదర్శనకు బిసి సంక్షేమ సంఘం సంఘం జాతీయఅధ్యక్షులు,రాజ్య సభ సభ్యులు ఆర్ కృష్ణయ్య ముఖ్య అతిధిగా విచ్చేసి ప్రసంగించారు. ఈ స్కీముకు బడ్జెట్ ఇవ్వకుండా ముఖ్యమంత్రి పేద కులాల జీవితాలతో చెలగాటం ఆడుతున్నారని విమర్శించారు. ఫీజుల బకాయిలు ఇవ్వాలని శాంతియుతంగా ఉద్యమాలు చేస్తుంటే ప్రభుత్వం పట్టించుకోవడం లేదు. బీసీ, ఎస్సీ, ఎస్టీలు చదువుకుంటుంటే కూడా ఓర్వలేక పోతున్నారు. రాష్ట్ర ప్రభుత్వం విద్యా వ్యవస్థను భ్రష్టు పట్టిస్తున్నారని పేద కులాలు చదువుకోకుండా కుట్రలు చేస్తున్నారని విమర్శించారు.ఈ ఫీజుల బకాయిలు 8500 కోట్లు చెల్లించడం ముఖ్యమంత్రికి ఒకలెక్క కాదు. మూడున్నర సంవత్సరాలుగా విద్యార్థులు పడుతున్న భాదలు చెప్పతరం కాదు. కోర్సు పూర్తి అయిన 6 లక్షల మందికి కాలేజి యాజమాన్యాలు సర్టిఫికేట్లు ఇవ్వడం లేదు. వీరికి ఉద్యోగాలు వచ్చిన చేరలేక ఉన్నత విద్యకు పోలేక చాలా ఇబ్బంది పడుతున్నారు. చదువుతున్న వారి ఫీజులు కట్టే వరకు కాలేజీలకు రానివ్వడం లేదు. ఫీజుల బకాయిలు చెల్లించక పోవడంతో విద్యార్థులు నరకయాతన అనుభవిస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు.ఈ భారీ ప్రదర్శనలో రాష్ట్ర బిసి సంక్షేమ సంఘం వర్కింగ్ ప్రెసిడెంట్ నీల వెంకటేష్, రాష్ట్ర బిసి విద్యార్థి సంఘం రాష్ట్ర కన్వీనర్ నిఖిల్ పటేల్, అధ్యక్షులు పగిళ్ళ సతీష్, బిసి సంఘం రాష్ట్ర అధ్యక్షులు సి. రాజేందర్, నరేష్ గౌడ్, శివ కుమార్ యాదవ్, రమేష్, రాహుల్, సురేష్, రమణ, కె. వంశీ, బాలయ్య తదితరులు పాల్గొన్నారు.

TELANGANA VANI TELUGU DAILY
R N I No. APTEL/2012/53127
తెలంగాణ వాణి
తెలుగు దినపత్రిక



## రిమ్స్ ఎన్ఐసీయూ ఘటన స్థలాన్ని పరిశీలించిన కాంగ్రెస్ నేతలు



**ఆదిలాబాద్, సెప్టెంబర్ 23 (తెలంగాణ వాణి ప్రతినిధి):**
రిమ్స్ ఆసుపత్రి ఎన్ఐసీయూలో ఇటీవల జరిగిన విషాద ఘటన నేపథ్యంలో డీసీసీ అధ్యక్షులు డా. నరేష్ జాదవ్, మార్కెట్ కమిటీ చైర్మన్ బోరంచు శ్రీకాంత్ రెడ్డి బాధిత చిన్నారులను పరామర్శించారు. ప్రైవేట్ ఆసుపత్రుల్లో చికిత్స పొందుతున్న చిన్నారుల ఆరోగ్య పరిస్థితిని వైద్యులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం రిమ్స్‌లో ఘటన జరిగిన ఎన్ఐసీయూ ప్రాంతాన్ని పరిశీలించి, చిన్నారులకు మెరుగైన వైద్యం అందించాలని, బాధిత కుటుంబాలకు ప్రభుత్వ సహాయం అందేలా చూస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ అల్లూరి సంజీవ రెడ్డి, జిల్లా కాంగ్రెస్ ఆఫీసు ఇంచార్జ్ గౌలి సంజీవ్ కుమార్, మాజీ టీటీడీ బోర్డ్ మెంబర్ అనిల్ కుమార్, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు ఖిజార్ పాషా, యూత్ కాంగ్రెస్ అసెంబ్లీ ఉపాధ్యక్షులు రూపేష్ రెడ్డి, జిల్లా కాంగ్రెస్ ఎస్సీ విభాగం అధ్యక్షులు పరమేశ్వర్, జనరల్ సెక్రటరీ దేవిదాస్ చారి, మందాకిని, వార్డు ప్రెసిడెంట్లు తుమ్మ విశాల్, బండి సంజయ్, జహీర్, తదితర జిల్లా కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## గణపతి నిమజ్జనానికి పటిష్ట బందోబస్తు



**ఆదిలాబాద్, సెప్టెంబర్ 23 (తెలంగాణ వాణి ప్రతినిధి):**
బాసర జోన్ డీఐజీ ఆర్. భాస్కరన్ ఆదిలాబాద్‌లో పర్యటించి గణపతి నిమజ్జన ఉత్సవాల భద్రతా ఏర్పాట్లపై పోలీస్ అధికారులతో సమీక్షించారు. నిమజ్జన మార్గాల్లో ట్రాఫిక్ నియంత్రణ, విద్యుత్ తీగలు, భక్తులు, వాహనాల భద్రతపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. జైనథ్ మండలం పెనుగంగ వద్ద నిమజ్జన ప్రాంతాన్ని పరిశీలించి, ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా అప్రమత్తంగా ఉండాలని సిబ్బందికి సూచించారు. రిమ్స్ ఘటనలో మృతి చెందిన చిన్నారుల కుటుంబాలకు డీఐజీ ప్రగాఢ సానుభూతి తెలిపారు.

## ధాన్యం కొనుగోళ్లకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలి



**నిజామాబాద్, సెప్టెంబర్ 23 (తెలంగాణ వాణి ప్రతినిధి):**
అక్టోబర్ 1 నుంచి ఖరీఫ్ ధాన్యం కొనుగోళ్లు ప్రారంభించనున్న నేపథ్యంలో అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని కలెక్టర్ భవేష్ మిశ్రా అధికారులను ఆదేశించారు. రైతులకు ఇబ్బందులు లేకుండా కొనుగోలు కేంద్రాలు, గిడ్డంగుల్లో అవసరమైన సదుపాయాలు కల్పించాలని సూచించారు. ఎస్ఐఆర్ ప్రక్రియను గడువులోగా పూర్తి చేయాలని, భూభారతి పెండింగ్ దరఖాస్తులను వచ్చే వారంలోగా పరిష్కరించాలని ఆదేశించారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను వేగవంతం చేయడంతో పాటు మిగిలిన 1,561 డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లను వారంలోగా పారదర్శకంగా కేటాయించాలని సూచించారు. మైనారిటీ సంక్షేమ పథకాలపై విస్తృత అవగాహన కల్పించాలని కలెక్టర్ తెలిపారు. షాదీ ముబారక్‌కు కేటాయించిన రూ. 19.98 కోట్లలో ఇప్పటివరకు రూ. 7.79 కోట్లు పంపిణీ చేసినట్లు తెలిపారు. సమావేశంలో అదనపు కలెక్టర్ వి. భుజంగరావు, ఆర్మూర్ సబ్ కలెక్టర్ అభిగ్యాన్ మాల్వియ, ట్రైనీ కలెక్టర్ సురేష్, డీఆర్ఓ గీత, నగర పాలక సంస్థ కమిషనర్ దిలీప్ కుమార్, ఆర్డీఓలు రాజేంద్రకుమార్, విజయకుమారి, డీఆర్‌డీఓ సాయన్న తదితరులు పాల్గొన్నారు.

## వరి ధాన్యం కొనుగోలుకు చర్యలు చేపట్టాలి: సురేంద్ర మోహన్




**నిర్మల్ టౌన్, సెప్టెంబర్ 23 (తెలంగాణ వాణి విలేఖరి):**
వరి ధాన్యం కొనుగోలుకు అన్ని జిల్లాల్లో అవసరమైన ఏర్పాట్లు పూర్తి చేయాలని రాష్ట్ర వ్యవసాయ శాఖ కార్యదర్శి సురేంద్ర మోహన్ అధికారులను ఆదేశించారు. కొనుగోలు కేంద్రాల్లో లారీలు, టార్పాలిన్లు, గన్నీ సంచులు, హమాలీలు, ఇతర మౌలిక వసతులు సిద్ధం చేయాలని సూచించారు. సన్న వడ్లకు క్వింటాల్‌కు రూ. 500 బోనస్ అందిస్తామని తెలిపారు. డిజిటల్ క్రాప్ సర్వే, ఫార్మర్ రిజిస్ట్రీ ప్రక్రియలను వెంటనే పూర్తి చేయాలని ఆదేశించారు. డియో కాన్ఫరెన్స్‌లో ఇన్‌చార్జి అదనపు కలెక్టర్ (రెవెన్యూ) రాథోడ్ రమేష్ పాల్గొన్నారు. అనంతరం జిల్లాలో కొనుగోలు ఏర్పాట్లు, ఫార్మర్ రిజిస్ట్రీ, డిజిటల్ క్రాప్ సర్వే పురోగతిని ఆయన సమీక్షించారు. ఈ వీసీలో జిల్లా ఇన్ ఛార్జ్ అదనపు కలెక్టర్ (రెవెన్యూ) రాథోడ్ రమేష్, పౌర సరఫరాల అధికారులు రాజేందర్, సుధాకర్, వ్యవసాయ అధికారి సుజాత, ఇతర అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు

# బెల్టు మత్తులో ఆబ్కారీ

### తిమ్మాపూర్ పల్లెల్లో ఎమ్మార్పీ దందా పట్టించుకోని అధికారులు

**తిమ్మాపూర్, సెప్టెంబర్ 23 (తెలంగాణ వాణి ప్రతినిధి)**
తిమ్మాపూర్ మండలంలోని పలు గ్రామాల్లో బెల్టు దుకాణాల ద్వారా మద్యం విక్రయాలు యథేచ్ఛగా సాగుతున్నాయనే తీవ్ర ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. నిబంధనలకు విరుద్ధంగా అనధికారికంగా సాగుతున్న ఈ దందాపై ఆబ్కారీ శాఖ అధికారులు ఏమాత్రం పట్టించుకోవడం లేదని గ్రామస్థులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. సాధారణ రోజుల్లోనే కాకుండా పండుగ సమయాల్లో మద్యం సీసాలపై ఉన్న ఎమ్మార్పీ కంటే ప్రతి సీసాపై రూ. 20 నుంచి రూ. 50 వరకు అదనంగా వసూలు చేస్తూ వినియోగదారులను అందినకాడికి దండుకుంటున్నారు. బెల్టు దుకాణాల నిర్వాహకుల నుంచి ప్రతి నెలా మామూళ్లు అందుతుండటం వల్లే అధికారులు తనిఖీలు చేపట్టకుండా మౌనం వహిస్తున్నారనే ఆరోపణలు స్థానికంగా గట్టిగా వినిపిస్తున్నాయి. మరోవైపు వినాయక నిమజ్జనోత్సవాల నేపథ్యంలో మద్యం దుకాణాలు మూసివేయనుండంతో, కొందరు నిర్వాహకులు ఈ పరిస్థితిని ఆసరాగా చేసుకుని భారీగా మద్యం నిల్వలు పెంచుకుంటున్నారు. మద్యం దుకాణాలు బంద్ ఉండే రోజుల్లో మరింత అధిక ధరలకు విక్రయించి సొమ్ము చేసుకోవడానికే ఈ ముందస్తు నిల్వలు చేపడుతున్నారని గ్రామస్థులు చెబుతున్నారు. గ్రామీణ ప్రాంతాల్లో విచ్చలవిడిగా సాగుతున్న ఈ అక్రమ విక్రయాలపై ఆబ్కారీ శాఖ ఉన్నతాధికారులు తక్షణమే స్పందించి, ప్రత్యేక బృందాలతో తనిఖీలు నిర్వహించాలని ప్రజలు డిమాండ్



చేస్తున్నారు. అక్రమ నిల్వలు, ధరల దోపిడీపై నిఘా పెట్టి బెల్టు దుకాణాలపై కఠిన చర్యలు తీసుకోవడంతో పాటు నిర్లక్ష్యం వహిస్తున్న అధికారులపై విచారణ జరిపించాలని కోరుతున్నారు.



## ఆయుర్వేదంతో సంపూర్ణ ఆరోగ్యం

**మంచిర్యాల, సెప్టెంబర్ 23 (తెలంగాణ వాణి):**
ఆయుర్వేద వైద్యంతో సంపూర్ణ ఆరోగ్యం సాధ్యమని జిల్లా అదనపు కలెక్టర్ పి. చంద్రయ్య అన్నారు. 11వ ఆయుర్వేద దినోత్సవం సందర్భంగా ప్రభుత్వ ఆసుపత్రిలో నిర్వహించిన మెగా ఆయుర్వేద వైద్య శిబిరాన్ని ఆయన సందర్శించారు. ఆరోగ్యకరమైన ఆహారం, వ్యాయామం, యోగా, ధ్యానంతో జీవనశైలి వ్యాధులను నియంత్రించవచ్చని సూచించారు. జిల్లాలోని 12 ఆయుర్వేద ఆసుపత్రుల సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో డీఎంహెచ్‌వో డా. నరేందర్ రాథోడ్, డా. శ్రీధర్, డా. నీరజ, రవీందర్ రాథోడ్, ఆయుష్ వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

## రూ.2.20 లక్షలకు గణనాథుని లడ్డూ వేలం



**రాంపల్లి, సెప్టెంబర్ 23 (తెలంగాణ వాణి):**
నాగారం డివిజన్ రాంపల్లిలో జై మాతా యూత్ ఆధ్వర్యంలో నిర్వహించిన గణేష్ లడ్డూ వేలం ఉత్సాహంగా జరిగింది. వేలంలో ప్రముఖ నేత కౌకుట్ల జీవన్ రెడ్డి రూ. 2,20,000లకు లడ్డూను దక్కించుకున్నారు. అనంతరం ఉత్సవ కమిటీ సభ్యులు ఆయనను సత్కరించి లడ్డూను అందజేశారు. కార్యక్రమంలో యువత, మహిళలు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## ఇన్‌ఛార్జి అదనపు కలెక్టర్‌గా రాథోడ్ రమేష్ బాధ్యతలు

**నిర్మల్ టౌన్, సెప్టెంబర్ 23 (తెలంగాణ వాణి విలేఖరి):**



నిర్మల్ జిల్లా ఇన్‌ఛార్జి అదనపు కలెక్టర్ (రెవెన్యూ)గా డీఆర్వో రాథోడ్ రమేష్ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. కలెక్టరేట్‌లోని అదనపు కలెక్టర్ ఛాంబర్‌లో బాధ్యతలు చేపట్టిన ఆయనను అధికారులు, ఉద్యోగులు మర్యాద పూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం జిల్లా పరిపాలన, రెవెన్యూ శాఖ కార్యక్రమాలపై అధికారులతో సమీక్షించారు. ఈ కార్యక్రమంలో డీఏఓ విష్ణువర్ధన్, సివిల్ సప్లై డీఎస్ఓ రాజేందర్, డీఎం సుధాకర్, ఏఓ ప్రవీణ్, రెవెన్యూ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## చెరుకుపల్లిలో స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ



**గుండ్లపల్లి, సెప్టెంబర్ 23 (తెలంగాణ వాణి ప్రతినిధి):**
చెరుకుపల్లి గ్రామపంచాయతీ ప్రాంగణంలో స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. సర్పంచ్ మీసాల రామచంద్రయ్య, పంచాయతీ కార్యదర్శి చిరంజీవులు, జీపీఓ రమేష్ లబ్ధిదారులకు కార్డులు అందజేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ముత్యాల శశిధర్ రెడ్డి, ఉపసర్పంచ్, వార్డు సభ్యులు, రేషన్ డీలర్లు, గ్రామ పెద్దలు, పంచాయతీ సిబ్బంది, లబ్ధిదారులు పాల్గొన్నారు.



## స్వాధీనం చేసిన 161 ట్రాక్టర్ల ఇసుకకు నేడు వేలం

**తిమ్మాపూర్, సెప్టెంబర్ 23 (తెలంగాణ వాణి ప్రతినిధి)**
కొత్తపల్లి గ్రామ శివారులో అక్రమ ఇసుక రవాణా కేసుల్లో స్వాధీనం చేసుకున్న 161 ట్రాక్టర్ల ఇసుకను గురువారం ఉదయం 11 గంటలకు బహిరంగ వేలం వేయనున్నట్లు తహశీల్దార్ కర్ర శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. వేలంలో పాల్గొనే వారు ఒక్కో ట్రాక్టర్‌కు రూ. 1,800 డిపాజిట్ చెల్లించాలని సూచించారు. వేలంలో ఇసుక దక్కించుకున్న వారు డిపాజిట్ మొత్తాన్ని ప్రభుత్వ చలానా ద్వారా చెల్లించి రసీదు సమర్పించాలని తెలిపారు.

## శ్రీ రామకృష్ణ సాయి మందిరంలో వినాయక యజ్ఞం





**రాజపేట, సెప్టెంబర్ 23, (తెలంగాణ వాణి)**
యాదాద్రి భువనగిరి జిల్లా రాజాపేట మండల కేంద్రంలో ని శ్రీ రామకృష్ణ సాయి మందిరంలో బుధవారం రోజున వినాయకుడి నవరాత్రి ఉత్సవాల సందర్భంగా గ్రామంలోని ప్రజలు సుభిక్షంగా ఉండాలని పాడి పంటలు బాగుండాలని వర్షాలు బాగా కురిసి గ్రామంలోని ప్రజలు అందరూ సుభిక్షంగా ఉండాలని శ్రీ రామకృష్ణ సాయి మందిరంలో శ్రీ రామకృష్ణ శర్మ ఆధ్వర్యంలో వినాయక యజ్ఞం నిర్వహించారు. ఉప్పల రమేష్ - స్వప్న, బెజుగం శ్రీను - రాజేశ్వరి, పెంట సత్యనారాయణ - రజిత భాయ్ దంపతులు యజ్ఞంలో పాల్గొన్నారు.

## ఉద్యోగ నోటిఫికేషన్లు విడుదల చేయాలని విఘ్నేశ్వరుడికి వినతిపత్రం



**నల్గొండ, సెప్టెంబర్ 23 (తెలంగాణ వాణి ప్రతినిధి):**
రాష్ట్రంలో గ్రూప్-1, గ్రూప్-2, గ్రూప్-3 ఉద్యోగాలకు నోటిఫికేషన్లు విడుదల చేయాలని కోరుతూ ఎస్సీ, ఎస్టీ విద్యార్థి సంఘం రాష్ట్ర అధ్యక్షులు కట్టెల శివకుమార్ ఆధ్వర్యంలో వినాయకుడికి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా శివకుమార్ మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి మూడేళ్లు కావస్తున్నా ఉద్యోగ నోటిఫికేషన్ల విషయంలో ఆశించిన స్థాయిలో చర్యలు తీసుకోకపోవడం బాధాకరమన్నారు. తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమంలో విద్యార్థులు కీలక పాత్ర పోషించారని పేర్కొన్నారు. ఎన్నికల సమయంలో ప్రభుత్వం లక్ష ఉద్యోగాలు భర్తీ చేస్తామని హామీ ఇచ్చిందని గుర్తుచేశారు. నిరుద్యోగ యువత, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, పేద విద్యార్థులకు న్యాయం జరిగేలా వెంటనే ఉద్యోగ నోటిఫికేషన్లు జారీ చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి బందారు శంకర్, సెంట్రల్ కమిటీ సభ్యులు కొండేటి నరేష్ కుమార్, రాష్ట్ర ఉపాధ్యక్షులు రమేష్ నాయక్, జిల్లా ఉపాధ్యక్షులు కాసర్ల లింగస్వామి, మబ్బు శివ తదితరులు పాల్గొన్నారు.



## ఐటీ టవర్‌ను సందర్శించిన కలెక్టర్

**నిజామాబాద్, సెప్టెంబర్ 23 (తెలంగాణ వాణి ప్రతినిధి)**
జిల్లా కేంద్రంలోని ఐటీ టవర్‌ను కలెక్టర్ భవేష్ మిశ్రా బుధవారం సందర్శించారు. ప్రస్తుతం 13 కంపెనీల్లో సుమారు 380 మంది పనిచేస్తున్నట్లు అధికారులు తెలిపారు. స్థానికంగా మరిన్ని ఐటీ కంపెనీలు ఏర్పాటయ్యేలా చూడాలని, తద్వారా యువతకు ఉద్యోగ అవకాశాలు పెరుగుతాయని కలెక్టర్ సూచించారు. స్టార్టప్‌లకు ఐటీ టవర్‌ను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

## రిమ్స్ చిన్నారుల మరణాలు ప్రభుత్వ హత్యలే: కవిత



**ఆదిలాబాద్, సెప్టెంబర్ 23 (తెలంగాణ వాణి ప్రతినిధి):**
రిమ్స్‌లో అగ్ని ప్రమాదంతో ఐదుగురు చిన్నారులు మృతి చెందడం ప్రభుత్వ నిర్లక్ష్యమేనని తెలంగాణ రక్షణ సేన చీఫ్ కల్వకుంట్ల కవిత ఆరోపించారు. ప్రమాదం జరిగిన ఎస్ఎన్‌సీయూను పరిశీలించిన ఆమె.. ఘటనపై ఆసుపత్రి సిబ్బంది, చిన్నారుల తల్లిదండ్రులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. ముఖ్యమంత్రి స్పందించి బాధిత కుటుంబాలను పరామర్శించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే రాథోడ్ బాపూరావు టీఆర్ఎస్ జిల్లా అధ్యక్షులు, మరియు ఆదిలాబాద్ అసెంబ్లీ నియోజకవర్గం ఇంచార్జి వేణుగోపాల్ యాదవ్ టీఆర్ఎస్ పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

## చిన్నారులకు మెరుగైన వైద్యం అందించాలి: కలెక్టర్ రాజర్షి షా



**ఆదిలాబాద్, సెప్టెంబర్ 23 (తెలంగాణ వాణి ప్రతినిధి):**
రిమ్స్ ఎస్ఎన్‌సీయూలో జరిగిన అగ్ని ప్రమాదంలో ప్రభావితమైన చిన్నారులకు మెరుగైన వైద్యం అందించాలని కలెక్టర్ రాజర్షి షా అధికారులను ఆదేశించారు. పట్టణంలోని ప్రైవేట్ ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్న చిన్నారులను పరామర్శించి, ఆరోగ్య పరిస్థితిని వైద్యులను అడిగి తెలుసుకున్నారు. చిన్నారుల ఆరోగ్యాన్ని నిరంతరం పర్యవేక్షిస్తూ అవసరమైన చికిత్స అందించాలని సూచించారు. కార్యక్రమంలో డీఎంహెచ్‌ఓ డా. సాధన, వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

## వైభవంగా శ్రీ విఘ్నేశ్వరుడి నిమజ్జన మహోత్సవం



**రాంపల్లి దాయర, సెప్టెంబర్ 23 (తెలంగాణ వాణి):**
కీసర మండలం రాంపల్లి దాయరలోని వెంకులోని గుట్టలో హేమాద్రి శ్రీ వేంకటేశ్వర స్వామి దేవస్థానం ఆధ్వర్యంలో శ్రీ విఘ్నేశ్వరుడి నిమజ్జన మహోత్సవం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. లడ్డూ వేలంపాటలో మాజీ సర్పంచ్ దంపతులు గరుగుల ఆండాళ్--మల్లేష్ రూ. 32 వేలకు లడ్డూను దక్కించుకున్నారు. ట్రస్ట్ చైర్మన్ కందాడి హేమలత--హనుమంత్ రెడ్డి, సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

## హౌసింగ్ సొసైటీ గణేష్ లడ్డూ వేలం



**నస్పూర్, సెప్టెంబర్ 23 (తెలంగాణ వాణి)**
నస్పూర్ టీఎన్జీవో హౌసింగ్ సొసైటీ శ్రీ సిద్ధి వినాయక గణేష్ మండలి ఆధ్వర్యంలో నిర్వహించిన లడ్డూ వేలంలో అనూహ్య అనురాగ్ దంపతులు రూ. 20,116లకు లడ్డూను దక్కించుకున్నారు. టీఎన్జీవో హౌసింగ్ సొసైటీ అధ్యక్షురాలు గడియారం పల్లవి--శ్రీహరి దంపతుల కుమార్తె, అల్లుడు అయిన వారికి ఉత్సవ కమిటీ సభ్యులు శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో సొసైటీ నాయకులు, కమిటీ సభ్యులు, కాలనీవాసులు పాల్గొన్నారు.

## వినాయక సన్నిధిలో జీఎంఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో అన్నదానం




**నారాయణఖేడ్, సెప్టెంబర్ 23 (తెలంగాణ వాణి ప్రతినిధి):**
సీతారాం తండాలో కొనసాగుతున్న వినాయక నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా జీఎంఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో గణేష్ మండపం వద్ద అన్నదానం నిర్వహించారు. ఫౌండేషన్ చైర్మన్ గుఱ్ఱపు మచ్చేందర్ ఆదేశాల మేరకు ఏర్పాటు చేసిన కార్యక్రమంలో భక్తులు, గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని అన్నప్రసాదం స్వీకరించారు. మాజీ సర్పంచ్ రాజు, సర్పంచ్ బాబు సింగ్, చంద్ర నాయక్, విశ్వనాథ్ జాదవ్ తదితరులు పాల్గొన్నారు.

## గణేష్ నిమజ్జనానికి అన్ని ఏర్పాట్లు పూర్తి: కలెక్టర్



**నల్గొండ, సెప్టెంబర్ 23 (తెలంగాణ వాణి ప్రతినిధి)**
: జిల్లాలో గణేష్ నిమజ్జనం, శోభాయాత్రకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు కలెక్టర్ బి. చంద్రశేఖర్ తెలిపారు. హనుమాన్‌నగర్‌లో గణేష్ విగ్రహానికి పూజలు నిర్వహించి శోభాయాత్రను ప్రారంభించారు. జిల్లాలో సుమారు 6 వేల విగ్రహాలు ఉండగా, బుధవారం నుంచి శుక్రవారం వరకు మరో 2 వేల విగ్రహాలు నిమజ్జనం కానున్నట్లు తెలిపారు. నిమజ్జన ప్రాంతాల్లో వైద్య, రెవెన్యూ, పోలీస్ సిబ్బందిని ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ఎస్పీ శరత్చంద్ర పవర్ మాట్లాడుతూ బుధవారం ఒక్కరోజే సుమారు 2 వేల విగ్రహాలు 8 నిమజ్జన ప్రాంతాల్లో నిమజ్జనం కానున్నాయని, ప్రశాంత వాతావరణం కోసం పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశామని తెలిపారు. కార్యక్రమంలో మేయర్ బుర్రి చైతన్య శ్రీనివాస్ రెడ్డి, అడిషనల్ ఎస్పీ రమేష్, ఆర్డీఓ వై. అశోక్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## జిల్లా సర్పంచ్ల ఫోరం వర్కింగ్ ప్రెసిడెంట్‌కు సన్మానం



**దేవరకొండ, సెప్టెంబర్ 23 (తెలంగాణ వాణి ప్రతినిధి):**
నల్లగొండ జిల్లా సర్పంచ్ల ఫోరం వర్కింగ్ ప్రెసిడెంట్‌గా నియమితులైన శాంతిగూడెం సర్పంచ్ చింతలపూడి భాస్కర్‌రెడ్డిని దేవరకొండ ఎమ్మెల్యే నేనావత్ బాలునాయక్ శాలువాతో సన్మానించారు. కాంగ్రెస్ పార్టీలో కష్టపడి పనిచేసే వారికి భవిష్యత్‌లో మంచి అవకాశాలు లభిస్తాయని ఎమ్మెల్యే పేర్కొన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు రామస్వామి, కొర్ర రాంసింగ్ నాయక్, రాజ్‌కుమార్, ఆంజనేయులు, కొట్టే అనంతయ్య తదితరులు పాల్గొన్నారు.

## గద్దపాకలో స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ



**శంకరపట్నం, సెప్టెంబర్ 23 (తెలంగాణవాణి)**
మండలంలోని గద్దపాక గ్రామపంచాయతీ ఆవరణలో బుధవారం స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. గ్రామ సర్పంచ్ కొయ్యడ పరుశరాములు యాదవ్ గ్రామ ప్రజలకు స్మార్ట్ రేషన్ కార్డులను అందజేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ, ప్రతి నెల రేషన్ తీసుకునే సమయంలో స్మార్ట్ రేషన్ కార్డును వెంట తీసుకెళ్లాలని, ప్రభుత్వం అందించే రాయితీలు, సంక్షేమ పథకాల ప్రయోజనాలను పొందేందుకు కార్డును సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ప్రభుత్వం అందిస్తున్న 6 కిలోల బియ్యంను అర్హులైన ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ జంగా జైపాల్, గ్రామ పాలకవర్గ సభ్యులు, పంచాయతీ కార్యదర్శి తిరుపతి, జీపీఓ తిరుపతితో పాటు గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

## అక్రమంగా మద్యం అమ్మితే కఠిన చర్యలు : ఎస్సై తకియోద్దీన్

**రాజపేట సెప్టెంబర్: 23(తెలంగాణ వాణి విలేఖరి)**
యాదాద్రి భువనగిరి జిల్లా రాజపేట మండల కేంద్రంలో రేణిగుంట గ్రామంలో అక్రమంగా మద్యం అమ్ముతున్నారని సమాచారంతో పోలీసులు తనిఖీ చేయగా కోరు కొప్పుల ఆంజనేయులు తన ఇంట్లో అక్రమంగా నిలువచేసిన 8.1 లీటర్ల మద్యం పట్టుబడి చేసి పంజినామ నిర్వహించి ఎస్ఐ తగ్గియుద్దిన్ కేసు నమోదు చేశారు. అక్రమంగా మద్యం నిలువ చేసి ఎవరైనా అమ్మినచో కఠినమైన చర్యలు తీసుకుంటానని హెచ్చరించారు.

# కోరుకంటి చందర్ జన్మదినం సందర్భంగా ఆశ్రమంలో అన్నదానం..

### నిస్సహాయ చిన్నారులతో కలిసి కేక్ కట్ చేసిన బీఆర్ఎస్ నాయకులు..



**పెద్దపల్లి,సెప్టెంబర్,23 (తెలంగాణ వాణి జిల్లా ప్రతినిధి )**
రామగుండం మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ పెద్దపల్లి జిల్లా అధ్యక్షుడు కోరుకంటి చందర్ జన్మదినాన్ని పురస్కరించుకుని రామగుండం పట్టణ బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు బొడ్డుపల్లి శ్రీనివాస్ ఆధ్వర్యంలో స్థానిక తబిత పిల్లల ఆశ్రమంలో ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా చిన్నారుల మధ్య కేక్ కట్ చేసి, వారికి అన్నదానం చేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ కోరుకంటి చందర్ ప్రజాసేవకు అంకితభావంతో పనిచేస్తూ ప్రజల ఆదరణ పొందారని పేర్కొన్నారు. ఆయన జన్మదినాన్ని సేవా కార్యక్రమాల ద్వారా జరుపుకోవడం ఆనందంగా ఉందన్నారు. అనంతరం ఆశ్రమంలోని చిన్నారులకు భోజనాలు వడ్డించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాడిశెట్టి రవీందర్, ఉప్పరి లక్ష్మణ్, ఈదునూరి నర్సింగ్, ఆశాది వేణుగోపాల్, కత్తర్ల నర్సింగ్, ఆర్నపల్లి రాజు, మాచర్ల నరేష్, ఖలీల్ పాషా, జగన్మోహన్ రావు, అంతర్గాం మండల నాయకులు కరివేద శ్రీనివాస్ రెడ్డి, కంపల్లి సంతోష్, ఆవునూరి రాజేష్, గుమ్ముల నవీన్, ఆవునూరి ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

## దుర్గపు సుజాత కుటుంబాన్ని పరామర్శించిన మంత్రి పొన్నం



**శంకరపట్నం, సెప్టెంబర్ 23(తెలంగాణ వాణి)**
మండలంలోని తాడికల్ గ్రామ సర్పంచ్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకురాలు దుర్గపు సుజాత ఇటీవల అనారోగ్యంతో మృతి చెందడంతో బీసీ సంక్షేమ, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ బుధవారం తాడికల్‌లోని ఆమె నివాసానికి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించారు. సుజాత చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించి, కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ సందర్భంగా సుజాత కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి, ప్రజా సమస్యల పరిష్కారానికి, గ్రామ అభివృద్ధికి చేసిన సేవలను మంత్రి పొన్నం ప్రభాకర్ గుర్తు చేసుకున్నారు. పార్టీ పట్ల ఆమె చూపిన అంకితభావం, ప్రజల పట్ల ఉన్న సేవా భావం ఎప్పటికీ గుర్తుండిపోతాయని అన్నారు. అనంతరం ఆమె కుమారుడు, కుమార్తె చదువుల వివరాలను అడిగి తెలుసుకుని, కష్టపడి చదివి ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో టీపీసీసీ సభ్యులు, మాజీ జెడ్పీటీసీ బత్తిని శ్రీనివాస్ గౌడ్, శంకరపట్నం మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు బండారి తిరుపతి, స్థానిక కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.



## నాయిని చెరువు వద్ద గణేష్ నిమజ్జనం ప్రారంభం

### పాల్గొన్న మున్సిపల్ చైర్మన్ మొలుగు ప్రశాంత్ కుమార్ దిలీప్

**జమ్మికుంట, సెప్టెంబర్ 23 (తెలంగాణ వాణి ప్రతినిధి)**
: జమ్మికుంట పట్టణంలో గణేష్ నవరాత్రి ఉత్సవాల అనంతరం నాయిని చెరువు వద్ద నిమజ్జన కార్యక్రమాలు ప్రారంభమయ్యాయి. తొలి గణేష్ విగ్రహాన్ని మున్సిపల్ చైర్మన్ మొలుగు ప్రశాంత్ కుమార్ దిలీప్ ఆధ్వర్యంలో నిమజ్జనం చేశారు. నిమజ్జన ప్రాంతంలో భద్రత, పారిశుద్ధ్యం, విద్యుత్, తాగునీటి ఏర్పాట్లు చేసినట్లు అధికారులు తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ గుట్టల మల్లికార్జున స్వామి, వైస్ చైర్మన్ ముంతాజ్ అలీ జావేద్, అధికారులు, కౌన్సిలర్లు, ఉత్సవ కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

## వృద్ధాశ్రమంలో కోరుకంటి చందర్ జన్మదిన వేడుకలు



**పెద్దపల్లి, సెప్టెంబర్ 23 (తెలంగాణ వాణి జిల్లా ప్రతినిధి):**
రామగుండం మాజీ ఎమ్మెల్యే, పెద్దపల్లి జిల్లా బీఆర్ఎస్ అధ్యక్షుడు కోరుకంటి చందర్ జన్మదిన వేడుకలను బీఆర్ఎస్ నాయకులు వీర్లపల్లి ఈశ్వర్ కృప వృద్ధాశ్రమంలో నిర్వహించారు. వృద్ధుల సమక్షంలో కేక్ కట్ చేసి, వారికి తినిపించారు. చందర్ ఆయురారోగ్యాలతో ప్రజాసేవలో మరిన్ని సంవత్సరాలు కొనసాగాలని నాయకులు ఆకాంక్షించారు. కార్యక్రమంలో పి.టి. స్వామి, అచ్చ వేణు, నూతి తిరుపతి, బొడ్డు రవీందర్, మెతుకు దేవరాజ్ తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా గణనాథుల శోభాయాత్ర.. భక్తిశ్రద్ధలతో నిమజ్జనం

**రామకృష్ణాపూర్, సెప్టెంబర్ 23 (తెలంగాణ వాణి):**
గణేష్ నవరాత్రి ఉత్సవాల ముగింపు సందర్భంగా రామకృష్ణాపూర్‌లో బుధవారం గణనాథుల శోభాయాత్ర, నిమజ్జనం వైభవంగా జరిగాయి. శోభాయాత్రలో రాష్ట్ర మంత్రి వివేక్ వెంకటస్వామి పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. డప్పులు, బాజాభజంత్రీలు, కోలాటాలు, యువత నృత్యాలతో శోభాయాత్ర సందడిగా సాగింది. గోదావరి వద్ద విగ్రహాలను భక్తిశ్రద్ధలతో నిమజ్జనం చేశారు. ఎస్ఐ జె. శ్రీధర్ ఆధ్వర్యంలో పోలీసులు పటిష్ట బందోబస్తు, డ్రోన్ కెమెరాలతో నిఘా ఏర్పాటు చేశారు.





## మృతుని కుటుంబాన్ని పరామర్శించిన మాజీ ఎమ్మెల్యే

**ఎల్లారెడ్డి, సెప్టెంబర్ 23 (తెలంగాణ వాణి ప్రతినిధి):**
ఎల్లారెడ్డి మాజీ కౌన్సిలర్, బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు ఎండీ. ఇమ్రాన్ తండ్రి సజ్జద్ మృతి చెందడంతో మాజీ ఎమ్మెల్యే జాజాల సురేందర్ ఆయన కుటుంబాన్ని పరామర్శించారు. మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించి, అంత్యక్రియల్లో పాల్గొన్నారు. అనంతరం కుటుంబ సభ్యులను ఓదార్చి ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఆయన వెంట బీఆర్ఎస్ నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు ఉన్నారు.

## ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో ఘనంగా నిమజ్జనం



**ఎల్లారెడ్డి, సెప్టెంబర్ 23 (తెలంగాణ వాణి ప్రతినిధి):**
ఎల్లారెడ్డి ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో బుధవారం గణేష్ నిమజ్జన కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. సంఘ సభ్యులు అధిక సంఖ్యలో పాల్గొని భక్తిశ్రద్ధలతో గణనాథుడికి వీడ్కోలు పలికారు. కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు సిద్ధి శ్రీధర్ గుప్తా, కోశాధికారి సాయినాథ్ గుప్తా, ప్రధాన కార్యదర్శి ఓర విఠల్ గుప్తా, సిద్ధి చక్రధర్, ముప్పిడి భైరవ ప్రసాద్, డాక్టర్ మారుతిరావు తదితరులు పాల్గొన్నారు.

## జగన్ కుటుంబానికి రూ.2 లక్షల ఆర్థిక సాయం



**ఎండపల్లి, సెప్టెంబర్ 23 (తెలంగాణ వాణి):**
ఇటీవల మృతి చెందిన ఎండపల్లి బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు సింహాచలం జగన్ కుటుంబాన్ని నియోజకవర్గ నాయకుడు వ్యాల హరీష్‌రెడ్డి పరామర్శించారు. కుటుంబ సభ్యులను ఓదార్చి, పిల్లల చదువుల కోసం రూ.2 లక్షల ఆర్థిక సాయం అందించారు. ఇందులో రూ.లక్ష తన సొంత నిధుల నుంచి, మరో రూ.లక్ష అమెరికాలోని ఎన్ఆర్ఐ బీఆర్ఎస్ మిత్రుల తరఫున అందించినట్లు తెలిపారు. కార్యక్రమంలో మంథని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధు, బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ధర్మారెడ్డిలో స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమం



**నాగిరెడ్డిపేట, సెప్టెంబర్ 23 (తెలంగాణ వాణి ప్రతినిధి):**
స్వచ్ఛతా హీ సేవా పక్షోత్సవాల్లో భాగంగా ధర్మారెడ్డి గ్రామంలో సర్పంచ్ లక్ష్మీనారాయణ ఆధ్వర్యంలో పారిశుద్ధ్య కార్యక్రమం నిర్వహించారు. మురుగు కాలువలను శుభ్రం చేసి, పిచ్చిమొక్కలకు గడ్డిమందు పిచికారీ చేశారు. వర్షాకాల వ్యాధుల నివారణకు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సర్పంచ్ సూచించారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ జయరాజు, పంచాయతీ కార్యదర్శి రమేష్, పాలకవర్గ సభ్యులు, సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

## శేరిలింగంపల్లి జోనల్ ఆఫీస్‌లో గణేష్ లడ్డూ వేలం



**హైదరాబాద్/శేరిలింగంపల్లి, సెప్టెంబర్ 23 (తెలంగాణ వాణి విలేకరి):**
శేరిలింగంపల్లి జోనల్ ఆఫీస్‌లో నిర్వహించిన గణేష్ లడ్డూ వేలం ఉత్సాహంగా జరిగింది. జోనల్ కమిషనర్ నారాయణ్ అమిత్ ఐఏఎస్, భక్తులు, స్థానిక ప్రముఖులు పాల్గొన్నారు. వేలంలో కాంట్రాక్టర్ వెంగళరావు రూ.1.80 లక్షలకు లడ్డూను దక్కించుకున్నారు. కార్యక్రమంలో ఉత్సవ కమిటీ సభ్యులు, స్థానిక నాయకులు, భక్తులు పాల్గొన్నారు.

## బొల్లారంలో పశు ఆరోగ్య శిబిరం



**నాగిరెడ్డిపేట, సెప్టెంబర్ 23 (తెలంగాణ వాణి ప్రతినిధి):**
జిల్లా పశుసంవర్ధక శాఖ, డీఎల్‌డీఏ సంయుక్త ఆధ్వర్యంలో బొల్లారం గ్రామంలో పశు వంధ్యత్వ నివారణ, పశు ఆరోగ్య శిబిరం నిర్వహించారు. పశువులకు వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన చికిత్స అందించారు. 24 పశువులకు సాధారణ చికిత్స, 25 దూడలకు నట్టల నివారణ మందు అందించారు. కార్యక్రమంలో సర్పంచ్ ప్రభు గౌడ్, వెటర్నరీ అసిస్టెంట్ సర్జన్ డా. రవికుమార్, పంచాయతీ కార్యదర్శి సంతోష్, అధికారులు, గోపాలమిత్రలు, పాడి రైతులు పాల్గొన్నారు.

## గోలివాడలో నిమజ్జన ఏర్పాట్లపై అధికారుల పర్యవేక్షణ



**పెద్దపల్లి, సెప్టెంబర్ 23 (తెలంగాణ వాణి జిల్లా ప్రతినిధి):**
గోలివాడ గోదావరి నది వద్ద వినాయక నిమజ్జనాల నేపథ్యంలో అధికారులు భద్రతా ఏర్పాట్లను పర్యవేక్షించారు. అంతర్గాం తహసీల్దార్ పడాల ప్రసాద్ రావు ఆధ్వర్యంలో నాయబ్ తహసీల్దార్ మల్యాల తిరుపతి, ఆర్ఐ గుంట రమేష్తో పాటు పోలీస్, వైద్య, విద్యుత్ శాఖల అధికారులు నిమజ్జన ఘాట్‌ను పరిశీలించారు. భక్తుల భద్రత, విద్యుత్, వైద్య, అత్యవసర సేవలపై ప్రత్యేక దృష్టి సారించి, నిమజ్జనం పూర్తయ్యే వరకు సమన్వయంతో విధులు నిర్వహించనున్నట్లు తెలిపారు.

## కుటుంబం బలపడితేనే సమాజం బలోపేతం

### సామాజికవేత్త శశిధర్ రెడ్డి

**వీణవంక, సెప్టెంబర్ 23 (తెలంగాణ వాణి ప్రతినిధి):**



కుటుంబాలు బలోపేతమైతేనే సమాజం, దేశం అభివృద్ధి చెందుతాయని సామాజికవేత్త శశిధర్ రెడ్డి అన్నారు. మారుతున్న కాలానికి అనుగుణంగా యువత వివాహం, కుటుంబ జీవనం, వ్యక్తిగత స్వేచ్ఛపై స్వతంత్రంగా నిర్ణయాలు తీసుకునే అవకాశం కల్పించాలని సూచించారు. వివాహం ప్రేమ, పరస్పర గౌరవం, బాధ్యతలతో కూడిన బంధమని పేర్కొన్నారు. కుమార్తెలు, కుమారులకు సమాన గౌరవం, విద్య, నిర్ణయ స్వేచ్ఛ కల్పించాలని, పిల్లలకు ఆస్తులతో పాటు కుటుంబ విలువలు, బాధ్యత, సంస్కృతి--సంప్రదాయాలపై అవగాహన కల్పించాలని తెలిపారు. యువత నిర్ణయాలను గౌరవిస్తూ తల్లిదండ్రులు అనుభవంతో సరైన మార్గదర్శకత్వం అందించాలని శశిధర్ రెడ్డి కోరారు.

## కురుమ సంఘం ఆధ్వర్యంలో అన్నప్రసాద వితరణ



**వీణవంక, సెప్టెంబర్ 23 (తెలంగాణ వాణి ప్రతినిధి)**
: వల్బాపూర్ గ్రామంలో కురుమ సంఘం ఆధ్వర్యంలో గణేష్ ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. గణనాథుడికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించిన అనంతరం భక్తులకు మహా అన్నప్రసాదం వితరణ చేశారు. సాయంత్రం భజనలు, నినాదాల మధ్య శోభాయాత్ర నిర్వహించి తొలి గణేష్ విగ్రహాన్ని నిమజ్జనం చేశారు. కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు బూడిగే రాజయ్య, ఉపాధ్యక్షుడు ఒగ్గ శ్రీనివాస్, పోతారాజు మహేందర్, కుల పెద్దలు, యువకులు, భక్తులు పాల్గొన్నారు.

## పొట్యాలలో మురుగు కాలువల దుస్థితి

**పెద్దపల్లి, సెప్టెంబర్ 23 (తెలంగాణ వాణి జిల్లా ప్రతినిధి):**
అంతర్గాం మండలం పొట్యాల గ్రామంలో మురుగు కాలువలు చెత్తాచెదారం, ప్లాస్టిక్ వ్యర్థాలు, పిచ్చిమొక్కలతో మూసుకుపోయాయి. మురుగునీరు నిలిచిపోవడంతో దోమల బెడద, దుర్వాసనతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. వర్షాకాలంలో పరిస్థితి మరింత అధ్వానంగా మారిందని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వెంటనే డ్రైనేజీలను శుభ్రం చేసి, దోమల నివారణ చర్యలు చేపట్టాలని అధికారులను కోరుతున్నారు.



## హైనా దాడిలో లేగదూడ మృతి



**చిగురుమామిడి, సెప్టెంబర్ 23 (తెలంగాణ వాణి విలేఖరి):**
గాగిరెడ్డిపల్లె గ్రామానికి చెందిన రైతు మొలుగురి రవీందర్ వ్యవసాయ క్షేత్రంలోని షెడ్డులో కట్టేసిన ఏడాదిన్నర వయసున్న లేగదూడపై బుధవారం తెల్లవారుజామున హైనా దాడి చేసి చంపింది. దూడ విలువ సుమారు రూ.20 వేలు ఉంటుందని రైతు తెలిపారు. సమాచారం అందుకున్న అటవీ శాఖ బీట్ ఆఫీసర్ సమీనా సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. సర్పంచ్ సన్నీళ్ల కవిత వెంకటేశం బాధిత రైతును పరామర్శించి, ప్రభుత్వం తగిన నష్టపరిహారం అందించాలని కోరారు.

## పాఠశాల అభివృద్ధికి ఉప సర్పంచ్ వేముల అనిల్‌రావు చేయూత

**గుండ్లపల్లి, సెప్టెంబర్ 23 (తెలంగాణ వాణి ప్రతినిధి)**
: డిండి మండలం తవక్లాపూర్ ప్రభుత్వ పాఠశాల అభివృద్ధికి గ్రామ ఉప సర్పంచ్ వేముల అనిల్‌రావు రూ.50 వేల విలువైన బ్రాంచ్ గేట్, గార్డెన్ గ్రిల్స్‌ను అందించారు. వీటిని తహసీల్దార్ శ్రీనివాస్ గౌడ్, సర్పంచ్ పొన్నగంటి కృష్ణయ్య, ఉప సర్పంచ్ అనిల్‌రావు ప్రారంభించారు. ప్రభుత్వ పాఠశాలలకు ప్రజాప్రతినిధులు వ్యక్తిగతంగా సహకరించడం అభినందనీయమని తహసీల్దార్ పేర్కొన్నారు. కార్యక్రమంలో హెచ్‌ఎం డి. రాజేందర్‌రెడ్డి, పాఠశాల చైర్మన్ రాములమ్మ, వార్డు సభ్యులు లక్ష్మీకాంతారావు, జైపాల్, శ్రీను, గ్రామస్తులు వెంకటేశ్వరరావు, సత్యం, రమేష్‌రావు, దేవేందర్‌రావు, యాదగిరిరావు, కొండల్‌రావు, ప్రేమయ్య, రామ్‌రెడ్డి, వెంకటయ్య, దేవస్వామి, నాగేశ్వరరావు, పరమేష్, వెంకటేష్, సీతారాంరెడ్డి, నరేందర్, రవి, ముత్యాలు, చంటి, ఆంజనేయులు, రమేష్, వెంకటేశ్వర్లు, విష్ణు తదితరులు పాల్గొన్నారు.





## ప్లాస్టిక్ రహిత గ్రామానికి స్టీల్ ప్లేట్ల విరాళం



**ధర్మారం, సెప్టెంబర్ 23 (తెలంగాణ వాణి)**
ప్లాస్టిక్ రహిత గ్రామంగా తీర్చిదిద్దే లక్ష్యంతో సర్పంచ్ మందాల శ్రావణి హరీష్ చేపట్టిన కార్యక్రమానికి దాతలు సహకరించారు. కీర్తిశేషులు సుంకరి రవీందర్ జ్ఞాపకార్థం ఆయన కుమారులు సాయికుమార్, మణికుమార్, రామ్ 200 స్టీల్ ప్లేట్లను గ్రామపంచాయతీకి విరాళంగా అందించారు. శుభకార్యాల్లో ప్రజలు వీటిని ఉచితంగా వినియోగించుకోవాలని సర్పంచ్ సూచించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి తాళ్ల కిరణ్‌కుమార్, ఉప సర్పంచ్ పూసల మల్లేశం, వార్డు సభ్యులు గాజుల ముని, జోగుల లక్ష్మీ, కొమురయ్య, రేషవేణి, మహేష్, గ్రామస్తులు పాల్గొన్నారు.

## గురుకులాల్లో మూగబోయిన 'ఫోన్ మిత్ర'.. విద్యార్థుల అవస్థలు

**ధర్మారం, సెప్టెంబర్ 23 (తెలంగాణ వాణి):**
సాంఘిక సంక్షేమ గురుకులాల్లో విద్యార్థులు తల్లిదండ్రులతో మాట్లాడేందుకు ఏర్పాటు చేసిన 'ఫోన్ మిత్ర' టెలిఫోన్ బాక్సులు సాంకేతిక సమస్యలతో పనిచేయడం లేదని విద్యార్థులు, తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సర్వర్, కనెక్టివిటీ సమస్యలతో గత ఆరు నెలలుగా ఫోన్లు సరిగా పనిచేయడం లేదని పేర్కొన్నారు. అత్యవసర సమయాల్లో హౌస్‌మాస్టర్లు, వార్డెన్ల మొబైల్ ఫోన్లను ఆశ్రయించాల్సి వస్తోందన్నారు. విద్యార్థుల సౌకర్యార్థం వెంటనే సాంకేతిక లోపాలను సరిదిద్ది 'ఫోన్ మిత్ర'ను పునరుద్ధరించాలని వారు ప్రభుత్వాన్ని కోరారు.



# ఘనంగా రామగుండం మాజీ ఎమ్మెల్యే జన్మదిన వేడుకలు

- **భారీగా తరలివచ్చిన బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు**
- **బిఆర్ఎస్ అంతర్గాం మండల అధ్యక్షులు కోల సంతోష్**

**పెద్దపల్లి , సెప్టెంబర్ 23 (తెలంగాణ వాణి జిల్లా ప్రతినిధి )**
బీఆర్ఎస్ పెద్దపల్లి జిల్లా అధ్యక్షులు, రామగుండం మాజీ ఎమ్మెల్యే కోరుకంటి చందర్ జన్మదిన వేడుకలు అంతర్గాం మండల కేంద్రంలో ఘనంగా నిర్వహించారు. బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు కోల సంతోష్ గౌడ్ ఆధ్వర్యంలో జరిగిన ఈ వేడుకలకు మాజీ ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు, వివిధ గ్రామాల నుంచి తరలివచ్చిన అభిమానులు పెద్ద సంఖ్యలో హాజరై సందడి చేశారు.చందర్ జన్మదినాన్ని పురస్కరించుకుని బీఆర్ఎస్ శ్రేణులు బాణాసంచా కాల్చి తమ అభిమానాన్ని చాటుకున్నారు. అనంతరం భారీ కేక్‌ను కట్ చేసి పరస్పరం శుభాకాంక్షలు తెలుపుకున్నారు. మిఠాయిలు పంచుతూ సంబరాలు చేసుకున్నారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ అనుకూల నినాదాలతో అంతర్గాం మండల కేంద్రం మార్మోగింది.ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ కోరుకంటి చందర్‌కు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ప్రజలతో మమేకమై పార్టీ బలోపేతానికి కృషి చేస్తున్న చందర్ మరెన్నో పుట్టినరోజులు జరుపుకోవాలని



ఆకాంక్షించారు. ఈ కార్యక్రమం లో మాజీ అంతర్గాం వైస్ ఎంపీపీ శ్రీమతి మట్ట మహేందర్ రెడ్డి, గోలివాడ మాజీ సర్పంచ్ ధరణి రాజేష్, రాయదండి మాజీ సర్పంచ్ ధర్మాజీ కృష్ణ, ఎలక కొమురయ్య, నక్క జితేందర్, గాంధీ, అంజి, బండి మహేష్, గాదం శివ, బోడకుంట తిరుపతి, బరపటి తిరుపతి, గోశిక తిరుపతి, అర్ష నపల్లి రాజు, ఆవునూరి రాజేష్, కాంపెల్లి సంతోష్, చంద్రమౌళి, ఓల్లెపు మల్లేష్, గోర్క సంతోష్, బరపటి చొక్కయ్య, మెండ రమేష్, గద్దల రాజశేఖర్, ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

# వీ హబ్‌ను సందర్శించిన గీతం విద్యార్థినులు

- **గీతం మహిళా సాధికారిత సెల్ ఆధ్వర్యంలో ఏర్పాటు**
- **వ్యవస్థాపకత, స్టార్టప్ లపై అవగాహన**

**పటాన్ చెరు, సెప్టెంబర్ 22, (తెలంగాణ వాణి):**
హైదరాబాదులోని గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం విద్యార్థినులు బుధవారం వీ హబ్ (ఔజు ఎఖదీ)ను సందర్శించారు. గీతం మహిళా సాధికారత సెల్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ పారిశ్రామిక సందర్శన ద్వారా విద్యార్థులకు వ్యవస్థాపకత, స్టార్టప్ పర్యావరణ వ్యవస్థపై విలువైన అవగాహన కల్పించారు. మహిళా సాధికారత సెల్ చైర్ పర్సన్ ప్రొఫెసర్ ప్రీతి పర్వేకర్ పర్యవేక్షణలో, సుమారు 40 మంది విద్యార్థినులు, ఐదుగురు మహిళా అధ్యాపకులు ఈ సందర్శనలో పాల్గొన్నారు. మహిళా పారిశ్రామికవేత్తల కోసం భారతదేశపు మొట్టమొదటి రాష్ట్ర–ఆధారిత నోడల్ ఈ సందర్శన ద్వారా విద్యార్థులు తరగతి గదిలో నేర్చుకున్న విషయాలను వాస్తవ ప్రపంచ పారిశ్రామిక పద్ధతులతో అనుసంధానించుకోవడంతో పాటు, మహిళా నేతృత్వంలోని వ్యవస్థాపకత, నాయకత్వం, సృజనాత్మకత, సమస్య–పరిష్కారంపై అవగాహన పొందారు. ఇది వారి వృత్తిపరమైన, వ్యక్తిగత



అభివృద్ధికి దోహదపడే ఒక అర్థవంతమైన అనుభవపూర్వక అభ్యాస అవకాశంగా ఉపయోగపడింది.ఈ సందర్శనలో సీఎస్ఎస్ఈ విభాగం నుంచి జ్యోతి బంకాపల్లి, డాక్టర్ అపర్ణ, ఆర్కిటెక్చర్ విభాగం నుంచి డాక్టర్ సౌపూర్ణి పాల్, మనస్తత్వశాస్త్ర విభాగం నుంచి డాక్టర్ దుర్గేష్ నందిని తదితర అధ్యాపకులు పాల్గొన్నారు.

# గణనాథులకు ఘన వీడ్కోలు

**కరీంనగర్ నుంచి కొత్తపల్లి, మానకొండూరు వరకు**

**వైభవంగా వినాయక నిమజ్జనోత్సవాలు**

**కరీంనగర్, సెప్టెంబర్ 23 (తెలంగాణ వాణి ప్రతినిధి):**
తొమ్మిది రోజులపాటు పూజలందుకున్న గణనాథులకు కరీంనగర్ ప్రజలు ఘనంగా వీడ్కోలు పలికారు. నగరంతో పాటు కొత్తపల్లి, మానకొండూరు ప్రాంతాల్లో బుధవారం వినాయక నిమజ్జనోత్సవాలు వైభవంగా జరిగాయి. మంత్రి





పొన్నం ప్రభాకర్, కలెక్టర్ చిత్రా మిశ్రా, సీపీ గౌస్ ఆలం, ఎమ్మెల్యేలు గంగుల కమలాకర్, కవ్వంపల్లి సత్యనారాయణ, మేడిపల్లి సత్యం తదితరులు ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. కరీంనగర్‌లో సుమారు 4 వేల విగ్రహాలను శోభా యాత్రలుగా నిమజ్జన కేంద్రాలకు తరలించారు. అధికారులు క్రేన్లు, లైటింగ్, వైద్య బృందాలు, గజ ఈతగాళ్లు, తాగునీరు, పారిశుద్ధ్య ఏర్పాట్లు చేశారు. పోలీసులు భారీ బందోబస్తు, ట్రాఫిక్ నియంత్రణ చేపట్టడంతో నిమజ్జన వేడుకలు ప్రశాంతంగా ముగిశాయి.

# నవ సమాజ నిర్దేశకులు గురువులు

- **పటాన్ చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి**
- **ఎమ్మెల్యే జిఎంఆర్ ఆధ్వర్యంలో ఘనంగా ప్రైవేట్ పాఠశాలల గురుపూజోత్సవ వేడుకలు**

**200 మంది ఉత్తమ ప్రైవేట్ ఉపాధ్యాయులకు ఘన సత్కారం**

**పటాన్ చెరు, సెప్టెంబర్ 23, (తెలంగాణ వాణి)**
ఒక దేశ భవిష్యత్తు నిర్మాణం తరగతి గదిలోనే జరుగుతుందని, ప్రతి విద్యార్థిని భావి భారత పౌరుడుగా తీర్చిదిద్దాల్సిన గురుతర బాధ్యత ప్రతి ఉపాధ్యాయుడి పై ఉందని పటాన్ చెరు శాసన సభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి అన్నారు. గత 25 సంవత్సరాలుగా గురుపూజోత్సవం పురస్కరించుకొని నియోజకవర్గంలోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల ఉపాధ్యాయులను ప్రతి ఏటా సన్మానించుకోవడం తన అదృష్టంగా భావిస్తున్నానని అన్నారు. బుధవారం స్థానిక శాసనసభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి ఆధ్వర్యంలో పటాన్ చెరు డివిజన్ పరిధిలోని జిఎంఆర్ కన్వెన్షన్ సెంటర్లో పటాన్ చెరు నియోజకవర్గ స్థాయి ప్రైవేటు పాఠశాలల గురుపూజోత్సవ వేడుకలు నిర్వహించారు.
ఈ సందర్భంగా నియోజకవర్గ పరిధిలోని ప్రైవేటు పాఠశాలలో ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికైన 200 మంది ఉత్తమ ఉపాధ్యాయులను






ఘనంగా సన్మానించారు.
అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే జిఎంఆర్ మాట్లాడుతూ.. పటాన్ చెరు నియోజకవర్గంలో అధిక శాతం పేద, మధ్యతరగతి కుటుంబాలు తమ పిల్లలని ప్రభుత్వ పాఠశాలలతో పాటు ప్రైవేటు పాఠశాలలకు పంపుతున్నారని తెలిపారు. కార్పొరేట్ పాఠశాలల ద్వారా పోటీ ఏర్పడుతున్నప్పటికీ ప్రైవేటు పాఠశాలలు మెరుగైన ఫలితాలు సాధిస్తున్నాయని అభినందించారు.
ప్రస్తుత సమాజంలో మొబైల్ వాడకం అత్యంత ప్రమాదకరంగా మారిందని తెలిపారు. టెక్నాలజీని మనిషి ఎదుగుదలకు ఉపయోగించుకుంటే అద్భుతమైన ఫలితాలు సాధించవచ్చుని.. అదే టెక్నాలజీని దుర్వినియోగం చేస్తే సమాజానికి ముప్పు వాటిల్లుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రతి ఉపాధ్యాయుడు తన తరగతి గదిలోని ప్రతి విద్యార్థి చదువుతోపాటు మానసిక ప్రవర్తన పై ఎప్పటికప్పుడు గమనించాలని విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా ఆయా పాఠశాలల ఉపాధ్యాయులు నిర్వహించిన సంస్కృతిక కార్యక్రమాలు అందరినీ అలరించాయి.

# గణపతి నిమజ్జనంలో ఎన్‌సీసీ కేడెట్ల సేవలు

**నర్సంపేట, సెప్టెంబర్ 23 (తెలంగాణ వాణి ప్రతినిధి):**
నర్సంపేటలో నిర్వహించిన గణపతి నిమజ్జనోత్సవాల్లో అశోక్‌నగర్ సైనిక పాఠశాలకు చెందిన 40 మంది ఎన్‌సీసీ కేడెట్లు సేవలందించారు. శోభాయాత్ర సజావుగా సాగేందుకు ప్రజల రద్దీ, ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించడంలో పోలీసులకు సహకరించారు. క్రమశిక్షణతో సేవలందించిన కేడెట్లను గణేష్ ఉత్సవ కమిటీ సభ్యులు, స్థానికులు అభినందించారు. ఈ కార్యక్రమంలో నర్సంపేట సీఐ శ్రీనివాస్, ఎస్సై గూడ అరుణ్ కుమార్,ప్రిన్సిపల్ గట్ల సురేందర్, డైరెక్టర్ కంసాని దామోదర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



## గణనాథులకు స్వాగతం పలికిన విహెచ్ పి- బజరంగ్దళ్ నాయకులు



**ధర్మారం,సెప్టెంబర్ 23 (తెలంగాణ వాణి )**
గణేష్ నవరాత్రుల ఉత్సవాల సందర్భంగా విశ్వహిందూ పరిషత్, బజరంగ్ దళ్ ఆధ్వర్యంలో అంబేద్కర్ కూడలిలో నిమజ్జనానికి వెళ్తున్న గణనాథులకు స్వాగతం పలికారు. ఈ కార్యక్రమం బజరంగ్ దళ్ జిల్లా నాయకులు దిలీప్ ఆధ్వర్యంలో జరిగింది. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి నాయకులు మాట్లాడుతూ హిందూ సాంస్కృతి సాంప్రదాయాలను యువత భక్తి మార్గంలో నడిచేందుకు కృషి చేయాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో బొమ్మ గాని సతీష్ కుమార్, బిజెపి మండల ప్రధాన కార్యదర్శి దేవి రాజలింగు, గోనే సాయి, బిజెపి సీనియర్ నాయకులు మేడవేమి శ్రీనివాస్, సందనవేణి లక్ష్మణ్, బాల్ రెడ్డి, మల్యాల వెంకటేశం, గుండేటి శ్రీనివాస్, విద్యా మారి రాజేందర్, తదితరులు పాల్గొన్నారు.

## రసులాబాద్ గ్రామంలో స్వచ్ఛతాహి సేవా కార్యక్రమం



**కొమురవెల్లి సెప్టెంబర్.23(తెలంగాణ వాణి ప్రతినిధి)**
బుధవారం రోజున సిద్దిపేట జిల్లా కొమురవెల్లి మండలంలోని రసులాబాద్ గ్రామంలో గ్రామ సర్పంచ్ పచ్చిమడ్ల అనూష స్వామి గౌడ్ ఆధ్వర్యంలో స్వచ్ఛతాహి కార్యక్రమం నిర్వహించడం జరిగింది గ్రామంలోని తడి పొడి చెత్త వేరు చేసుట గురించి ప్రజలకు వివరంగా అవగాహన కల్పించడం జరిగింది అదేవిధంగా స్కూల్లో పిల్లలకి పరిశుభ్రత మరియు తడి పొడి చెత్త గురించి వారికి కూడా తెలియజెయడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ సుదర్శన్ మాజీ సర్పంచ్ స్వామి గౌడ్ పంచాయతీ కార్యదర్శి బాల నరసయ్య వార్డు సభ్యులు మల్లేశం శ్రీకాంత్ పరశురాములు పాఠశాల ఉపాధ్యాయురాలు సుప్రజా రమేష్ గ్రామ ప్రజలు మహిళలు గ్రామ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు

## జిల్లాస్థాయి ఎస్జీఎఫ్ అండర్-17 కబడ్డీ పోటీలు

**బాలుర విభాగంలో మదనాపూర్..**

**బాలికల విభాగంలో ఘనపూర్ విజయం**



**వనపర్తి, సెప్టెంబర్ 23 (తెలంగాణ వాణి ప్రతినిధి)**
: పెద్దమందడి మండలం మంగంపల్లిలో ఎస్జీఎఫ్ ఆధ్వర్యంలో నిర్వహించిన జిల్లాస్థాయి అండర్–17 కబడ్డీ పోటీలు ఉత్సాహంగా ముగిశాయి. బాలుర విభాగంలో మదనాపూర్ ప్రథమ, కొత్తకోట ద్వితీయ స్థానాలు సాధించగా.. బాలికల విభాగంలో ఘనపూర్ ప్రథమ, పెబ్బేరు ద్వితీయ స్థానాల్లో నిలిచాయి. జిల్లాలోని 15 మండలాల విద్యార్థులు పోటీల్లో పాల్గొన్నారు. విద్యార్థులను క్రీడల్లో ప్రోత్సహించేందుకు ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి పూర్తి సహకారం అందించారని నిర్వాహకులు తెలిపారు. డీవైఎస్ఓ సుధీర్‌రెడ్డి, ఇన్‌చార్జి కుమార్, సర్పంచ్ రమేష్ నాయక్, ఎంపీడీఓ పరిణతి, 15 మండలాల పీడీలు, క్రీడా ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## అగ్ని ప్రమాదాలపై అవగాహన కార్యక్రమం



**వనపర్తి, సెప్టెంబర్ 23 (తెలంగాణ వాణి ప్రతినిధి)**
: వనపర్తి జిల్లా కేంద్రంలోని గాంధీనగర్‌లో శ్రీరామ్ యూత్ ఆధ్వర్యంలో వినాయక మండపం వద్ద ఫైర్ సేఫ్టీ అధికారులు కాలనీ ప్రజలకు అగ్ని ప్రమాదాల నివారణపై అవగాహన కల్పించారు. విద్యుత్ ఉపకరణాల వినియోగంలో జాగ్రత్తలు, అధిక లోడ్‌కు దూరంగా ఉండటం, గ్యాస్ లీకేజీ సమయంలో తీసుకోవాల్సిన చర్యలను వివరించారు. ప్రమాదం సంభవించినప్పుడు అప్రమత్తంగా వ్యవహరించి వెంటనే 101కు సమాచారం ఇవ్వాలని సూచించారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు, కాలనీ ప్రజలు పాల్గొన్నారు. అవగాహన కల్పించిన ఫైర్ సేఫ్టీ అధికారులను కమిటీ సభ్యులు శాలువాతో సన్మానించారు.

## కాలనీ ప్రజల నీటి సమస్యను పరిష్కరించిన కౌన్సిలర్



**వనపర్తి : సెప్టెంబర్ 23, (తెలంగాణ వాణి ప్రతినిధి)**

వనపర్తి జిల్లా కేంద్రంలో బుధవారం ఉప్పరి లచ్చన్న కాలనీలో గత కొద్ది రోజుల క్రితం పాత మోటర్ పాడు కావడంతో బోరు మోటర్ లేకుండా చాలా ఇబ్బంది పడుతుంటే మున్సిపాలిటీ తెప్పించి కొత్త మోటర్ తెచ్చి మోటర్ బిగించిన ఏర్ల అరుణ మెకానిక్ శ్రీను కాలనీలో గత కొన్ని రోజులుగా వేధిస్తున్న తాగునీటి సమస్యకు కౌన్సిలర్ శాశ్వత పరిష్కారం చూపారు. పాడైపోయిన పాత మోటార్ స్థానంలో కొత్త మోటార్‌ను తెప్పించి శరవేగంగా పనులు పూర్తి చేయించారు. దీంతో కాలనీ ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. కాలనీకి నీటిని సరఫరా చేసే బోరు మోటార్ అకస్మాత్తుగా పాడైపోవడంతో స్థానికులు నీటి కోసం తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ఈ విషయాన్ని కాలనీవాసులు కౌన్సిలర్ దృష్టికి తీసుకెళ్లగా, ఆయన వెంటనే స్పందించారు. మున్సిపల్ అధికారులతో మాట్లాడి మున్సిపల్ నిధులతో అత్యవసరంగా కొత్త మోటార్‌ను తెప్పించారు. కౌన్సిలర్ స్వయంగా దగ్గరుండి మోటార్ బిగింపు పనులను పర్యవేక్షించి, నీటి సరఫరాను పునరుద్ధరించారు. ప్రజల ఇబ్బందులను తీర్చడమే నా మొదటి ప్రాధాన్యత భవిష్యత్తులో ఇలాంటి సమస్యలు రాకుండా నీటి సరఫరా వ్యవస్థను మరింత మెరుగుపరుస్తాం అని కౌన్సిలర్ తెలిపారు. ఈ సందర్భంగా కాలనీ ప్రజలు కౌన్సిలర్‌కు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

## దివ్యాంగుల పింఛన్ రూ.6 వేలకు పెంచే వరకు ఉద్యమం



**నర్సంపేట, సెప్టెంబర్ 23 (తెలంగాణ వాణి ప్రతినిధి):**

దివ్యాంగుల పింఛన్‌ను రూ. 6,000కు పెంచే వరకు ఉద్యమాలు కొనసాగిస్తామని ఎన్‌పీఆర్‌డీ ఇండియా వరంగల్ జిల్లా అధ్యక్షుడు అడ్డ రాజు అన్నారు. దుగ్గొండి మండల సమైక్య కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఇందిరమ్మ ఇళ్లలో దివ్యాంగులకు 5 శాతం రిజర్వేషన్, పెండింగ్ బ్యాక్‌లాగ్ ఉద్యోగాల భర్తీ చేపట్టాలని డిమాండ్ చేశారు. నవంబర్‌లో నిర్వహించనున్న 'చలో హైదరాబాద్' కార్యక్రమానికి దివ్యాంగులు పెద్ద సంఖ్యలో తరలిరావాలని పిలుపునిచ్చారు. సమావేశంలో నూతన దుగ్గొండి మండల కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా చింత కుమారస్వామి, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా మంద చంద్రమౌళి, ప్రధాన కార్యదర్శిగా యారా శ్రీనివాస్ తదితరులు ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా ఎన్‌పీఆర్‌డీ ఇండియా 5వ తెలంగాణ రాష్ట్ర మహాసభల పోస్టర్‌ను ఆవిష్కరించారు.

## వినాయకుడి ఆశీస్సులతో సర్పంచ్ కుటుంబానికి అదృష్టం

### లక్కీడ్రాలో రూ.45 వేల విలువైన ఎలక్ట్రిక్ స్కూటీ గెలుపు



**శంకరపట్నం, సెప్టెంబర్ 23 (తెలంగాణ వాణి):**

వినాయక నవరాత్రి ఉత్సవాల ముగింపు సందర్భంగా నిర్వహించిన లక్కీ డ్రాలో నల్లవెంకయ్యపల్లి గ్రామ సర్పంచ్ నాగలక్ష్మి భర్త మేడుదుల ఐలయ్యకు రూ. 45 వేల విలువైన ఎలక్ట్రిక్ స్కూటీ బహుమతిగా లభించింది. మొలంగూరు గ్రామ బస్టాండ్ సమీపంలోని వినాయక సేవా సమితి మండపంలో ఉత్సవాల సందర్భంగా నిర్వాహకులు లక్కీ డ్రా కూపన్లు విక్రయించారు. బుధవారం వినాయక నిమజ్జనం సందర్భంగా డ్రా నిర్వహించగా ఐలయ్య విజేతగా నిలిచారు. 2025లో నూతనంగా ఏర్పడిన నల్లవెంకయ్యపల్లి గ్రామపంచాయతీ తొలి ఎన్నికల్లో ఐలయ్య భార్య నాగలక్ష్మి సర్పంచ్‌గా ఎన్నికయ్యారు. సర్పంచ్ కుటుంబానికి లక్కీ డ్రాలో విలువైన బహుమతి రావడంతో గ్రామంలో ఆసక్తికర చర్చ సాగింది. వినాయకుడి నిమజ్జనం రోజున బహుమతి రావడం ఆనందంగా ఉందని ఐలయ్య తెలిపారు. గ్రామ శ్రేయస్సు, అభివృద్ధికి కృషి చేసేలా ఆశీర్వదించాలని విఘ్నేశ్వరుడిని కోరుకున్నట్లు చెప్పారు. గ్రామస్థులు ఐలయ్యకు అభినందనలు తెలిపారు.

## రాజీవ్ స్మారక ఫౌండేషన్ ట్రస్టు ఆధ్వర్యంలో ఆర్థిక సాయం

**చౌటుప్పల్, సెప్టెంబర్ 23 (తెలంగాణ వాణి డివిజన్ ప్రతినిధి):**

రాజీవ్ స్మారక ఫౌండేషన్ ట్రస్టు చైర్మన్ డా. రావుల మాధవరెడ్డి సహకారంతో ముగ్గురికి రూ. 15 వేల చొప్పున ఆర్థిక సాయం అందించారు. ఖైతాపురానికి చెందిన కోలుకులపల్లి అంజయ్య, చౌటుప్పల్‌కు చెందిన కుర్షిద్ బేగం, భాతరాజు రమేష్‌కు ఎం.ఏ. ఖయ్యుం, నల్ల నర్సింహ చేతుల మీదుగా సాయం అందజేశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ గోపి సుధాకర్, తరగం నాగరాజు, ముద్దం చింటు మాధవ్, పర్వతాలు, గుడ్డేటి ముత్యాలు, గోపనబోయిన ఎర్రయ్య, ఆగయ్య, కోలుకులపల్లి ప్రవీణ్, బత్తుల రాజు తదితరులు పాల్గొన్నారు.



## స్వచ్ఛతపై ఆకాశవాణి వరంగల్‌లో అవగాహన



**తెలంగాణ వాణి,ఉమ్మడి వరంగల్ బ్యూరో,(సెప్టెంబర్ 23) :**

స్వచ్ఛతపై ప్రజల్లో అవగాహన పెంపొందించేందుకు ఆకాశవాణి వరంగల్ కేంద్రం ఆధ్వర్యంలో 'స్వచ్ఛతా హి సేవా' కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా స్టేషన్ ఇన్‌చార్జి, కార్యక్రమ నిర్వహణ అధికారి ఇల్లందుల రవికుమార్, మరో కార్యక్రమ నిర్వహణ అధికారి నరేష్ కుమార్ పాల్గొని స్వచ్ఛత ప్రాధాన్యాన్ని ప్రజలకు వివరించారు. పరిసరాల పరిశుభ్రత, వ్యక్తిగత పరిశుభ్రత, చెత్తను నిర్దేశిత ప్రాంతాల్లోనే వేయడం, ప్లాస్టిక్



వినియోగాన్ని తగ్గించడం వంటి అంశాలపై అవగాహన కల్పించారు. స్వచ్ఛమైన పరిసరాలు ఆరోగ్యకరమైన సమాజానికి పునాది అని పేర్కొంటూ, ప్రతి ఒక్కరూ పరిశుభ్రతను తమ బాధ్యతగా భావించి ఆచరించాలని సూచించారు. ఆకాశవాణి ప్రసారాలతో పాటు ఇటువంటి ప్రత్యక్ష అవగాహన కార్యక్రమాల ద్వారా స్వచ్ఛత సందేశాన్ని ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లేందుకు కృషి చేస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో ఆకాశవాణి సిబ్బంది పాల్గొన్నారు.

## 'అంబేద్కర్ యువజన సంఘం' కన్వీనర్‌గా మంతెన మహేష్

**మల్హర్, సెప్టెంబర్ 23 (తెలంగాణ వాణి ప్రతినిధి):**

ఆల్ ఇండియా అంబేద్కర్ యువజన సంఘం మల్హర్ మండల నూతన కమిటీని ఎన్నుకున్నారు. మండల కన్వీనర్‌గా మంతెన మహేష్, కో-కన్వీనర్‌గా చంద్రగిరి ఎల్లారి నియమితులయ్యారు. రుద్రారం గ్రామానికి చెందిన వీరికి సంఘం రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి లింగాల రామయ్య, జిల్లా కోఆర్డినేటర్ పొట్ల పోచయ్య నియామక పత్రాలు అందజేశారు.

జాతీయ ఉపాధ్యక్షుడు మామిడిపల్లి బాపయ్య, రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ బొంకూరి మధు సూచనల మేరకు కమిటీని ఏర్పాటు చేసినట్లు లింగాల రామయ్య, పొట్ల



పోచయ్య తెలిపారు. దళిత, బహుజన, అణగారిన వర్గాల హక్కుల కోసం సంఘం పనిచేస్తుందని పేర్కొన్నారు. త్వరలో మండలంలోని అన్ని గ్రామాల్లో నూతన కమిటీలను ఏర్పాటు చేస్తామని తెలిపారు.

## వరుస చోరీలకు పాల్పడుతున్న ముఠా అరెస్ట్

మంచిర్యాల: మంచిర్యాల జిల్లాలోని బెల్లంపల్లి నియోజకవర్గ పరిధిలో పలు ప్రాంతాల్లో వరుస చోరీలకు పాల్పడుతున్న ఆరుగురు సభ్యుల దొంగల ముఠాను పోలీసులు సంయుక్తంగా అరెస్ట్ చేశారు. నిందితుల నుంచి రూ. 50 వేల నగదు, రెండు బైకులు, 10 కిలోల కాపర్ వైర్, ఐదు సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. బుధవారం తాండూర్ సర్కిల్ పోలీస్ కార్యాలయంలో సీఐ దేవయ్య ఆధ్వర్యంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో బెల్లంపల్లి ఏసీపీ కిరణ్ కుమార్ కేసు వివరాలను వెల్లడించారు.

ఏసీపీ తెలిపిన వివరాల ప్రకారం.. గత కొంతకాలంగా బెల్లంపల్లి, తాండూర్, భీమిని, నెన్నెల, తాళ్ల గురజాల, తిర్యాణి, రెబ్బెన మండలాల్లో నిందితులు వరుస చోరీలకు పాల్పడుతున్నారు. తాళం వేసి ఉన్న ఇళ్లు, కిరాణా దుకాణాలను లక్ష్యంగా చేసుకుని చోరీలు చేయడంతో పాటు వ్యవసాయ పంట పొలాల్లోని ట్రాన్స్‌ఫార్మర్లలో కాపర్ వైర్లను కూడా అపహరిస్తున్నట్లు పోలీసులు గుర్తించారు. ఈ క్రమంలో ప్రత్యేకంగా నిఘా ఏర్పాటు చేసిన పోలీసులు ఆరుగురు నిందితులను అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి రూ. 50 వేల నగదు, రెండు



ద్విచక్ర వాహనాలు, 10 కిలోల కాపర్ వైర్, ఐదు సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు.

అరెస్టయిన వారిలో కత్తెర్లకు చెందిన దూల రాజేశం, మీసాల బిక్షపతి, దూల నవీన్, బట్వాన్‌పల్లికి చెందిన ఊగం రాజేష్, బోయపల్లికి చెందిన బండి నీలేష్, రోల్లపాడుకు చెందిన రెబ్బెన శ్రీకాంత్ ఉన్నట్లు ఏసీపీ తెలిపారు. నిందితులపై కేసు నమోదు చేసి దర్యాప్తు కొనసాగిస్తున్నట్లు వెల్లడించారు. కేసును ఛేదించడంలో కీలకంగా పనిచేసిన పోలీసు సిబ్బందిని ఏసీపీ కిరణ్ కుమార్ క్యాష్ రివార్డుతో అభినందించారు. ఈ సమావేశంలో భీమిని, తాండూర్, బెల్లంపల్లి, నెన్నెల, తిర్యాణి ఎస్సైలు పాల్గొన్నారు.

## నిమజ్జనంలో అసభ్యకర డాన్స్‌లేస్తే కఠిన చర్యలు




హైదరాబాద్ నగరంలో వినాయక నిమజ్జన వేడుకలకు సర్వం సిద్ధమైంది. ఎలాంటి అవాంఛనీయ ఘటనలకు తావులేకుండా పకడ్బందీ భద్రతా ఏర్పాట్లు పూర్తి చేసినట్లుగా హైదరాబాద్ నగర పోలీసు కమిషనర్ వీసీ సజ్జనార్ (ఝా ఝయియిఝుతీ) తెలిపారు. నగరంలో గణేష్ నిమజ్జన ఏర్పాట్లపై ఆయన ఇవాళ మీడియా సమావేశంలో వివరాలు వెల్లడించారు. సమన్వయంతో ఉత్సవాలను విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు.

**భారీగా పోలీసు బలగాలు.. అత్యాధునిక సాంకేతిక నిఘా**

నిమజ్జన ప్రక్రియ ప్రశాంతంగా జరిగేందుకు పోలీసులు భారీ బందోబస్తును ఏర్పాటు చేశామని సీపీ సజ్జనార్ వెల్లడించారు. ఇందులో భాగంగా నగరవ్యాప్తంగా దాదాపు 20 వేల మంది పోలీసు సిబ్బందిని బందోబస్తు కోసం మోహరించామన్నారు. నిరంతర పర్యవేక్షణ కోసం 10 వేల అత్యాధునిక ఏఐ టెక్నాలజీ సీసీ కెమెరాలను ఏర్పాటు చేశామని తెలిపారు. ముఖ్యంగా ప్రధాన వేదిక అయిన ట్యాంక్‌బండ్ (ఖుఅనిఎబఅను) చుట్టూ భద్రతను పటిష్టం చేసేందుకు 100 హైరైజ్ కెమెరాలను పెట్టామని అన్నారు. అలాగే ఎలాంటి రద్దీ ప్రాంతాలనైనా ఎప్పటికప్పుడు గమనించేందుకు 24 డ్రోన్ల ద్వారా టెక్నికల్ నిఘా కొనసాగిస్తున్నామని పేర్కొన్నారు. తెలంగాణ రాష్ట్ర ఇంటిగ్రేటెడ్ కమాండ్ అండ్ కంట్రోల్ సెంటర్ నుంచి ఈ మొత్తం నిమజ్జన ప్రక్రియను ఉన్నతాధికారులు నిరంతరం పర్యవేక్షించనున్నట్లుగా సీపీ సజ్జనార్ తెలిపారు.

**మహిళల రక్షణకు ప్రత్యేక షీటీమ్స్..**

మహా నిమజ్జనంలో మహిళల భద్రతకు పోలీసులు అత్యంత ప్రాధాన్యతను ఇస్తున్నట్లుగా సీపీ సజ్జనార్ తెలిపారు. ఇందులో భాగంగా మహిళల రక్షణ కోసం మఫ్టీలో 26 షీటీమ్స్ (రాష్ట్రవ ఽఝఎం)ను రంగంలోకి దించామన్నారు. ఇప్పటి వరకు నిబంధనలు ఉల్లంఘించిన, వేధింపులకు పాల్పడిన 1,172 మంది ఆకతాయిలను అరెస్ట్ చేసినట్లుగా వెల్లడించారు. నిమజ్జన ఊరేగింపుల్లో అసభ్యకర డాన్స్‌లు చేస్తే కఠిన చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు. గణేశ్ వేడుకలకు సంబంధించి పాత, ఫేక్ వీడియోలు పోస్టు చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. శాంతిభద్రతలకు విఘాతం కలిగించేలా, మత సామరస్యాన్ని దెబ్బతీసేలా సోషల్ మీడియాలో పోస్టులు పెట్టే వారిపై 24 గంటలూ ప్రత్యేక నిఘా ఉంటుందని, తప్పుచూస్తే చట్టపరమైన కఠిన చర్యలు ఉంటాయని వార్నింగ్ ఇచ్చారు.

**ప్రజలంతా సహకరించాలి..**

ప్రశాంత వాతావరణంలో గణేష్ నిమజ్జన కార్యక్రమం విజయవంతంగా ముగిసేందుకు ప్రజలు, ఉత్సవ కమిటీ నిర్వాహకులు పోలీసు యంత్రాంగానికి పూర్తిస్థాయిలో సహకరించాలని సీపీ సజ్జనార్ కోరారు. ట్రాఫిక్ ఆంక్షలు, పోలీసుల సూచనలను ప్రజలు పాటించాలని విజ్ఞప్తి చేశారు.

## పారిశుద్ధ్య కార్మికులకు ఉచిత యునాని వైద్యం



**చౌటుప్పల్, సెప్టెంబర్ 23 (తెలంగాణ వాణి డివిజన్ ప్రతినిధి):**

11వ ఆయుర్వేద దినోత్సవం సందర్భంగా చౌటుప్పల్ పురపాలక కార్యాలయంలో పారిశుద్ధ్య కార్మికులకు ఉచిత యునాని వైద్య పరీక్షల శిబిరం నిర్వహించి మందులు పంపిణీ చేశారు. మున్సిపల్ చైర్‌పర్సన్ మొగుదాల పావని రమేష్ గౌడ్ మాట్లాడుతూ కార్మికులు ఆరోగ్యాన్ని కాపాడుకోవడానికి వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. మున్సిపల్ కమిషనర్ ఎన్. వెంకటేశ్వర నాయక్ మాట్లాడుతూ కార్మికుల సంక్షేమం కోసం శిబిరం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో యునాని మెడికల్ ఆఫీసర్ డాక్టర్ రోజ్ మేరీ, కౌన్సిలర్లు, మున్సిపల్ సిబ్బంది, స్థానికులు పాల్గొన్నారు.

## న్యాయవాదుల డెత్ బెనిఫిట్‌ను రూ.25 లక్షలకు పెంచాలి



**చౌటుప్పల్, సెప్టెంబర్ 23 (తెలంగాణ వాణి డివిజన్ ప్రతినిధి):**

ఆల్ ఇండియా లాయర్స్ యూనియన్ (ఐలు) జాతీయ కౌన్సిల్ పిలుపు మేరకు న్యాయవాదుల సంక్షేమ సమస్యల పరిష్కారం కోరుతూ బుధవారం చౌటుప్పల్ కోర్టు వద్ద న్యాయవాదులు నిరసన చేపట్టారు. ఐలు జిల్లా ఉపాధ్యక్షులు తడక మోహన్ మాట్లాడుతూ డెత్ బెనిఫిట్‌ను రూ. 25 లక్షలకు, వైద్య సహాయాన్ని రూ. 5 లక్షలకు పెంచాలని డిమాండ్ చేశారు. జూనియర్ న్యాయవాదులకు ఐదేళ్లపాటు నెలకు రూ. 10 వేల స్టైపెండ్ అందించాలని కోరారు. కార్యక్రమంలో ఎండీ ఖయ్యూం పాషా, ఉడుగు శ్రీనివాస్ గౌడ్, చామట్ల జంగయ్య, పాల పరమేష్, పిల్లలమర్రి కిరణ్, అయితగోని శ్రీకాంత్, నవీన్, మధుసూదన్ తదితర న్యాయవాదులు పాల్గొన్నారు.

## ఎన్‌సీసీ కంబైన్డ్ యాన్యువల్ ట్రైనింగ్ క్యాంపు



**హనుమకొండ, సెప్టెంబర్ 23 (తెలంగాణ వాణి)**

: మామునూరు పోలీస్ ట్రైనింగ్ కాలేజీలో ఈ నెల 20 నుంచి 29 వరకు ఎన్‌సీసీ కంబైన్డ్ యాన్యువల్ ట్రైనింగ్ క్యాంపు నిర్వహిస్తున్నారు. వరంగల్ గ్రూప్‌లోని వివిధ బెటాలియన్లకు చెందిన సుమారు 700 మంది ఎన్‌సీసీ క్యాడెట్లు శిక్షణ పొందుతున్నారు. డ్రిల్, ఫైరింగ్, మ్యాప్ రీడింగ్, డ్రోన్ శిక్షణతో పాటు క్రమశిక్షణ, దేశభక్తి, నాయకత్వ లక్షణాలపై శిక్షణ ఇస్తున్నట్లు క్యాంప్ కమాండెంట్ కల్నల్ సంతోష్ మెహెర్ తెలిపారు. క్యాంపులో అసిస్టెంట్ క్యాంప్ కమాండెంట్, లెఫ్టినెంట్ కల్నల్, సుబేదార్, అవ్వల్దార్, వివిధ విభాగాల అధికారులు, అసోసియేట్ ఎన్‌సీసీ అధికారులు, కేర్‌టేకర్లు, పీఐ, సివిలియన్ సిబ్బంది పాల్గొని శిక్షణ అందిస్తున్నారు.

## భద్రాద్రి క్లస్టర్ క్రీడా ఎంపికలు ప్రారంభం

### క్రీడలతో క్రమశిక్షణ, ఆత్మవిశ్వాసం పెంపు



**టేకులపల్లి, సెప్టెంబర్ 23 (తెలంగాణ వాణి)**

బద్దుతండా ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ స్కూల్‌లో భద్రాద్రి క్లస్టర్ స్థాయి క్రీడా ఎంపికలు బుధవారం ప్రారంభమయ్యాయి. ఇల్లందు ఎమ్మెల్యే కోరం కనకయ్య ముఖ్య అతిథిగా హాజరై విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలని సూచించారు. క్రీడలతో క్రమశిక్షణ, ఆత్మవిశ్వాసం, నాయకత్వ లక్షణాలు పెంపొందుతాయని అన్నారు. మూడు రోజులపాటు జరిగే ఎంపికల్లో వివిధ ఏకలవ్య పాఠశాలల విద్యార్థులు పాల్గొంటున్నారు. కార్యక్రమంలో ఎస్ఐ కె. తిరుపతి, కాంగ్రెస్ నాయకులు కోరం సురేందర్, ఈది గణేష్, పోశాలు, సర్దార్, సర్పంచులు నరేష్, కోరం సుభాష్ చంద్రబోస్ తదితరులు పాల్గొన్నారు.

మరోసారి విజయ్ దేవరకొండ-రష్మిక

# జోడీ మ్యాజిక్..

'రణబాలి' నుంచి 'పందయ్యా స్వామి' పాట విడుదల




టాలీవుడ్‌లో ప్రేక్షకుల నుంచి మంచి ఆదరణ పొందిన జోడీల్లో విజయ్ దేవరకొండ, రష్మిక మందన్న జోడీ ఒకటి. 'గీత గోవిందం', 'డియర్ కామ్రేడ్' చిత్రాల్లో కలిసి నటించిన ఈ జంట మరోసారి 'రణబాలి' సినిమాతో ప్రేక్షకుల ముందుకు రాబోతోంది. రాహుల్ సాంకృత్యన్ దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ చిత్రంపై ఇప్పటికే భారీ అంచనాలు ఉన్నాయి. తాజాగా ఈ సినిమా నుంచి 'పందయ్యా స్వామి' అనే పూర్తి పాటను చిత్రబృందం విడుదల చేసింది. 'పందయ్యా స్వామి' పాటకు అజయ్--అతుల్ సంగీతం అందించారు. పల్లెటూరి జానపద శైలికి ఆధునిక మెలోడీ స్వరాలను జోడిస్తూ పాటను ప్రత్యేకంగా రూపొందించారు. మొదటిసారి వినగానే శ్రోతలను ఆకట్టుకునేలా సంగీతాన్ని తీర్చిదిద్దారు. పాటలోని సాహిత్యం కూడా గ్రామీణ ప్రేమ, భావోద్వేగాలను ప్రతిబింబించేలా సాగుతుంది.

"పందయ్యా స్వామి.. ఇంతగా గాస్తాంది.. ఎన్నెలా ఊపేస్తా ఉంది" అంటూ సాగే పదాలు పాటకు ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తున్నాయి. గ్రామీణ వాతావరణాన్ని ప్రతిబింబించే పదజాలం, జానపద బాణీ, మెలోడీ కలయిక పాటకు ప్రత్యేకమైన అనుభూతిని అందిస్తున్నాయి. ఈ పాటలో విజయ్ దేవరకొండ, రష్మిక మందన్న మధ్య కెమిస్ట్రీ ప్రధాన ఆకర్షణగా నిలిచింది. గతంలో 'గీత గోవిందం', 'డియర్ కామ్రేడ్' సినిమాల్లో ఈ జోడీకి వచ్చిన ఆదరణ నేపథ్యంలో.. 'రణబాలి'లో వీరిద్దరినీ కలిసి చూడటంపై అభిమానుల్లో మొదటి నుంచే ఆసక్తి ఉంది.

తాజాగా విడుదలైన పాటలో వీరిద్దరి మధ్య కనిపించే ప్రేమ, భావోద్వేగాలు, సహజమైన హావభావాలు ప్రేక్షకులను ఆకట్టుకుంటున్నాయి. ముఖ్యంగా పాత్రలకు తగ్గట్టుగా విజయ్, రష్మిక కనిపిస్తున్న తీరు సినిమాపై ఆసక్తిని మరింత పెంచుతోంది. పాటలోని దృశ్యాల్లో పల్లెటూరి వాతావరణాన్ని సహజంగా చూపించే ప్రయత్నం కనిపిస్తోంది. పాత్రల దుస్తులు, పరిసరాలు, విజువల్స్ అన్నీ కథ జరిగే ప్రాంతానికి తగ్గట్టుగా ఉండటంతో పాటకు మరింత సహజత్వం వచ్చింది. 'పందయ్యా స్వామి' పాట విడుదలైన వెంటనే ప్రేక్షకుల నుంచి స్పందన మొదలైంది. ముఖ్యంగా పాటలోని జానపద శైలి, సంగీత కూర్పు, సాహిత్యం గురించి అభిమానులు చర్చించుకుంటున్నారు. విజయ్ దేవరకొండ--రష్మిక జోడీని మరోసారి తెరపై చూడబోతుండటంతో వారి అభిమానుల్లోనూ ఈ పాటపై ఆసక్తి కనిపిస్తోంది. గాయకుల ఆలాపన, సాహిత్యానికి అనుగుణంగా రూపొందించిన దృశ్యాలు పాటకు ప్రత్యేకమైన వాతావరణాన్ని తీసుకొచ్చాయి.

# సుబ్బలక్ష్మి సర్‌ప్రైజ్‌లకు మైండ్ బ్లాంక్ అవుతుంది

కయాదు లోహర్



సుబ్బలక్ష్మి 'ది ప్యారడైజ్' కథను మలుపు తిప్పుతుందని థియేటర్‌లో తన పాత్ర ఇచ్చే సర్‌ప్రైజ్‌లకు ప్రేక్షకుల మైండ్ బ్లాంక్ అవుతుందని అంటున్నారు కయాదు లోహర్. నానికి జోడీగా ఆమె నటించిన పీరియాడిక్ యాక్షన్ థ్రిల్లర్ 'ది ప్యారడైజ్'. శ్రీకాంత్ ఓదెల దర్శకుడు. మోహన్‌బాబు, సోనాలి కులకర్ణి, రాఘవ్ జుయల్ కీలక పాత్రలు పోషించారు. ఎస్‌ఎల్‌వీ సినిమాస్ బ్యానర్‌పై సుధాకర్ చెరుకూరి నిర్మించారు. సెప్టెంబరు 24న ఈ మూవీ ప్రేక్షకుల ముందుకు రానుంది. 'డ్రాగన్' సినిమా చూసిన తర్వాత నేను ఈ క్యారెక్టర్ చేయగలనని దర్శకుడు శ్రీకాంత్ నన్ను నమ్మి కథ చెప్పారు. తర్వాత లుక్ టెస్ట్ చేసి ఓకే చేశారు. ఇది నా కెరీర్‌లో చాలా పెద్ద ప్రాజెక్ట్. ఇందులో నన్ను అందరూ 'సుబ్బు' అని పిలుస్తారు! నా పాత్ర చాలా గ్రే షేడ్స్‌తో ఉంటుంది ఎన్నో సర్‌ప్రైజెస్ ఉంటాయి అవి తెరపైనే చూడాలి సాధారణ కమర్షియల్ సినిమాల్లో కథానాయిక పాత్ర అంత బలంగా ఉండవు. ఇందులో జడల్ జర్నీతో పాటు నా క్యారెక్టర్‌కి కూడా ఒక ప్రత్యేక ప్రయాణం ఉంటుంది. ఇది పూర్తి కంటెంట్ ఉన్న సినిమా. 'జడల్' లుక్‌లో నానిని చూసి షాకయ్యా.. తెలుగు సినీ పరిశ్రమలో ఇలాంటి స్క్రీన్ ప్రెజెన్స్ ఇంతవరకు ఎవరూ చూసుండరు. శ్రీకాంత్ ఓదెలలాంటి దర్శకులు అరుదుగా ఉంటారు. ఆయన విజన్, మేకింగ్ స్క్రీన్ మీద మ్యాజిక్ క్రియేట్ చేస్తాయి. దాన్ని తెరపైకి తీసుకురావడంలో నిర్మాత సుధాకర్ అన్నింటిలోనూ సహకరించారు. ఈ సినిమా కోసం నేనే డబ్బింగ్ చెప్పాలని ట్రై చేశా. దర్శకుడు శ్రీకాంత్ కూడా ప్రోత్సహించారు. కానీ కుదరలేదు. 'ది ప్యారడైజ్' చాలా పెద్ద ప్రాజెక్ట్.. ఈ సినిమా కోసం ఏకంగా ఏడాది పాటు షూటింగ్‌లో పాల్గొన్నా! ప్రతి నెలా షూట్ జరుగుతూనే ఉండేది. యాక్షన్ సినిమాలు, స్పోర్ట్స్ సినిమాలు చేయాలని ఉంది. అలాగే బయోపిక్ కూడా అవకాశం వస్తే చేయాలని ఉంది. సూర్యతో ఒక సినిమా చేస్తున్నాను. అలాగే మారి సెల్వరాజ్‌తో ఒక సినిమా చేస్తున్నా.

డబ్బు కంటే మానసిక ప్రశాంతతే

# విలువైనది

కోలీవుడ్ బ్యూటీ ఐశ్వర్యలక్ష్మి



కోలీవుడ్ బ్యూటీ ఐశ్వర్యలక్ష్మి తీసుకున్న ఒక సంచలన నిర్ణయం ఇండస్ట్రీలో హాట్ టాపిక్‌గా మారింది. కెరీర్ పరంగా దూసుకుపోతున్న ఈ సమయంలో ఆమె సోషల్ మీడియాకు పూర్తిగా గుడ్‌బై చెప్పడం వెనుక ఉన్న అసలు కారణాలను బయటపెట్టారు. తాజాగా, ఓ ఇంటర్వ్యూలో భాగంగా ఆసక్తికర విషయాలు పంచుకున్నారు. ఏదో కొద్దిరోజులు గ్యాప్ ఇద్దామని ఈ నిర్ణయం తీసుకోలేదని ఆమె స్పష్టం చేశారు. నేడు విపరీతంగా పెరిగిపోయిన ఏఐ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ టెక్నాలజీని కొందరు ఎంత నీచంగా వాడుకుంటున్నారో చూసి తాను తీవ్రంగా విసిగిపోయినట్లు తెలిపారు. ముఖ్యంగా సెలబ్రిటీలను టార్గెట్ చేస్తూ ఏఐ ద్వారా అసభ్యకరంగా ఫొటోలు, వీడియోలను ఎడిట్ చేసి పోస్ట్ చేస్తున్న సంస్కృతిని చూశాక.. తనకు ఆ నెట్‌వర్క్ మీద అసహ్యం వేసిందని వాపోయారు. ఈ డిజిటల్ పిచ్చికి దూరంగా ఉండటం వల్లే తన రియల్ లైఫ్‌లో అసలైన స్వేచ్ఛ దొరికిందని ఐశ్వర్యలక్ష్మి ఆనందం వ్యక్తం చేశారు.

అయితే ఈ నిర్ణయం వల్ల ఆర్థికంగా భారీ నష్టం తప్పదని ఆమె మేనేజర్ స్వయంగా హెచ్చరించినట్లు తెలిపారు. "దయచేసి మీ సోషల్ మీడియా అకౌంట్స్ మళ్లీ ఓపెన్ చేయండి.. లేదంటే బ్రాండ్స్, ప్రమోషన్స్ కోల్పోయి బోలెడు డబ్బు నష్టపోతారు" అని మేనేజర్ చెప్పినట్లు గుర్తుచేసుకున్నారు. కానీ, కోట్ల రూపాయల కంటే తనకు దొరికిన ఈ మానసిక ప్రశాంతతే వేల రెట్లు విలువైనదని తాను భావించినట్లు స్పష్టం చేశారు. గతంలో సోషల్ మీడియాలో వచ్చే ట్రోల్స్, నెగెటివ్ కామెంట్లు తన మనసుపై తీవ్ర ప్రభావం చూపాయని ఐశ్వర్యలక్ష్మి ఎమోషనల్ అయ్యారు. ఆ కామెంట్లు రోజూ చదవడం వల్ల ఈ ప్రపంచమంతా తనకే వ్యతిరేకంగా ఉందనే భ్రమ కలిగేదని, అసలు తనను ఇష్టపడేవారే లేరనే డిప్రెషన్‌లోకి వెళ్లిపోయినట్లు ఆమె వెల్లడించారు.

'ఆదర్శ కుటుంబం'

# విడుదల వాయిదా..



వెంకటేశ్ ఆదర్శ కుటుంబం - హౌస్ నెం.47' విడుదల వాయిదా పడింది. త్రివిక్రమ్ దర్శకత్వంలో రూపొందుతున్న ఈ ఫ్యామిలీ ఎంటర్‌టైనర్ అక్టోబరు 2న విడుదల కావాల్సి ఉండగా, మరో వారం ఆలస్యం కానుంది. అక్టోబరు 9న ఈ మూవీని విడుదల చేయనున్నట్లు చిత్ర నిర్మాణ సంస్థ హారిక హాసిని క్రియేషన్స్ పేర్కొంది. ఇప్పటికే విడుదల చేసిన ప్రచార చిత్రాలు సినిమాపై అంచనాలను పెంచాయి. 'ఆదర్శ కుటుంబం'లో శ్రీనిధిశెట్టి కథానాయిక. కుటుంబ అంశాలతో ముడిపడిన యాక్షన్ ఎంటర్‌టైనర్‌గా దీన్ని తీర్చిదిద్దుతున్నారు.

# రాఘవ లారెన్స్ 'మహావీర్ కర్ణ'..

కర్ణుడిగా మాస్ హీరో కొత్త అవతారం




టాలీవుడ్, కోలీవుడ్ ప్రేక్షకుల్లో తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న నటుడు, దర్శకుడు రాఘవ లారెన్స్ ప్రస్తుతం వరుస సినిమాలతో బిజీగా ఉన్నారు. నటుడిగానే కాకుండా దర్శకుడిగా, కొరియోగ్రాఫర్‌గా కూడా తన ప్రతిభను చాటుకున్న లారెన్స్.. విభిన్నమైన కథలను ఎంచుకుంటూ ప్రేక్షకులను అలరిస్తున్నారు. ఇప్పటికే పలు ఆసక్తికరమైన ప్రాజెక్టులను ప్రకటించిన ఆయన ఇప్పుడు ఊహించని విధంగా మరో భారీ చిత్రంతో ప్రేక్షకుల ముందుకు రాబోతున్నారు.రాఘవ లారెన్స్ హీరోగా తెరకెక్కనున్న ఈ కొత్త చిత్రానికి 'మహావీర్ కర్ణ' అనే టైటిల్‌ను ఖరారు చేశారు. భారతీయ ఇతిహాసాల్లో అత్యంత శక్తివంతమైన, విషాదభరితమైన పాత్రల్లో ఒకటిగా గుర్తింపు పొందిన కర్ణుడి జీవితాన్ని ఆధారంగా చేసుకుని ఈ చిత్రాన్ని రూపొందించనున్నట్లు మేకర్స్ ప్రకటించారు. తొలిసారి రాఘవ లారెన్స్ ఇలాంటి భారీ చారిత్రక నేపథ్యంతో కూడిన పాత్రలో కనిపించనుండటంతో ఈ ప్రాజెక్ట్‌పై ఇప్పటి నుంచే ఆసక్తి నెలకొంది. ఈ సినిమాకు టాలీవుడ్ దర్శకుడు రమేష్ వర్మ దర్శకత్వం వహించనున్నారు. 'ఖిలాడి', 'రాక్షసుడు' వంటి చిత్రాలతో తెలుగు ప్రేక్షకులకు పరిచయమైన రమేష్ వర్మ.. ఈసారి పూర్తిగా భిన్నమైన కథా ప్రపంచాన్ని ఎంచుకున్నారు.

ట్రైలర్ లేకుండానే

# 'ది ప్యారడైజ్' జోరు..

అడ్వాన్స్ బుకింగ్స్‌తో రూ.20 కోట్లకు చేరువ..




పెద్ద సినిమాల విడుదలకు ముందు ప్రేక్షకుల్లో ఆసక్తిని పెంచడంలో థియేట్రికల్ ట్రైలర్‌ది కీలక పాత్ర. కథ, హీరో పాత్ర, యాక్షన్ సన్నివేశాలు, దర్శకుడి విజన్ వంటి అంశాలను ట్రైలర్ ద్వారా చూపిస్తూ సినిమాపై అంచనాలను మరింత పెంచుతారు. అయితే నేచురల్ స్టార్ నాని, దర్శకుడు శ్రీకాంత్ ఓదెల కాంబినేషన్‌లో తెరకెక్కిన 'ది ప్యారడైజ్' మాత్రం ఇందుకు భిన్నంగా ముందుకు సాగుతోంది. ఇప్పటివరకు థియేట్రికల్ ట్రైలర్ విడుదల చేయకపోయినా.. ఈ సినిమాపై ప్రేక్షకుల్లో ఉన్న క్రేజ్ ఏమాత్రం తగ్గడం లేదు. విడుదలకు ముందే టికెట్ కౌంటర్ల వద్ద ఈ సినిమా బలమైన జోరు చూపిస్తోంది. సెప్టెంబర్ 24న ప్రపంచవ్యాప్తంగా భారీ స్థాయిలో ప్రేక్షకుల ముందుకు రానున్న 'ది ప్యారడైజ్'కు ఇప్పటికే అడ్వాన్స్ బుకింగ్స్ మొదలయ్యాయి.

మొదటి రోజు ప్రపంచవ్యాప్తంగా నమోదవుతున్న ముందస్తు టికెట్ విక్రయాలు వేగంగా పెరుగుతున్నాయి. తాజా సమాచారం ప్రకారం తొలి రోజు అడ్వాన్స్ బుకింగ్స్ ఇప్పటికే రూ.20 కోట్ల మార్క్‌కు చేరువైనట్లు తెలుస్తోంది. దీంతో ట్రేడ్ వర్గాల్లోనూ ఈ సినిమాపై ఆసక్తి పెరిగింది. విడుదలకు ఇంకా సమయం ఉండగానే ఈ స్థాయిలో వసూళ్లు నమోదవుతుండటం సినిమాకు ఉన్న ముందస్తు క్రేజ్‌ను తెలియజేస్తోంది. 'ది ప్యారడైజ్'పై అంచనాలు పెరగడానికి సినిమాలోని పాటలు కూడా ప్రధాన కారణంగా నిలుస్తున్నాయి. అనిరుధ్ రవిచందర్ అందించిన సంగీతం ఇప్పటికే ప్రేక్షకుల దృష్టిని ఆకర్షించింది. ముఖ్యంగా కాసర్ల శ్యామ్ సాహిత్యం అందించిన 'యేషానాగుల' పాట విడుదలైన తర్వాత ప్రత్యేకంగా వైరల్ అయింది. పాలమూరు జానపద బాణీకి మాస్ టచ్ జోడించడంతో ఈ పాటకు మంచి స్పందన లభించింది. ప్రభ బంగారిగల్ల, అద్దుల జంగిరెడ్డి ఆలపించిన ఈ పాట వినాయక చవితి వేడుకల్లోనూ విస్తృతంగా వినిపించింది.


Printed, Published & Owned by JERIPOTHULA SAMPATH, Printed at SRI BALAJI, H.No. 4-4-85, Tilak road, District Karimnagar. 505 001 (T.S)Published at H.No. 3-6-307, Subhash Nagar, Karimnagar MDI: District, Karimnagar -505 001 (T.S) Editor: JERIPOTHULA SAMPATH, RNI NO. APTEL/2012/53127 CELL:9912758107, telanganavanil@gmail.com